# వ్యవసాయం మరింత అభివృద్ధికి చర్యలు: నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18: రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో వ్యవసాయ శాఖ బలోపేతానికి సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిరంజన్ రెడ్డి సమాధానమిస్తూ..సాగుకు యోగ్యమైన ప్రతి 5 వేల ఎకరాలకు ఓ వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించినట్లు తెలిపారు. అధికారులకు వ్యవసాయానికి సంబంధించిన నూతన టెక్నాలజీని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వ్యవసాయ విద్యను పెంచడం కోసం 4నూతన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ కార్యాలయాల్లోమౌళిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నిరంజన్ రెడ్డి తెలిపారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 19-9-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 46 పేజీలు 8 వెల: రూ.1/-





హైదరాబాద్‌లో మంత్రి కెటిఆర్ సమక్షంలో తెలంగాణతో ఒప్పందం కుదుర్చుకున్న న్యూజెర్సీ స్టేట్ గవర్నర్ ఫిలిఫ్ మర్ఫీ, తెలంగాణ సిఎస్ ఎస్‌కె జోషి

## ఇరిగేషన్ ప్రాజెక్టులు శరవేగంగా పూర్తి

**• చెరువుల పునరుద్దరణతో 14లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చాం**

**– అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు శరవేగంగా పూర్తిచేస్తున్నామని మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం శాసన సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్‌రావు సమాధానమిస్తూ.. మిషన్‌కాకతీయ పథకానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని తెలిపారు. మిషన్‌కాకతీయ పథకంలో పునరుద్దరించిన చెరువులతో 14లక్షల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరిచ్చినమన్నారు. మిషన్‌కకతీయపై నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ డాక్యుమెంటరీ రూపొం దించిందని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసుకుంటున్నమని వెల్లడించారు. మిషన్‌కాకతీయకు కేంద్ర ఎలాంటి సాయం చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక పెద్దసంఖ్యలో ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 1,17 ,714 ఖాళీలు భర్తీ అయ్యాయని అన్నారు. మరో 31,668 ఉద్యోగాల నియామక ప్రక్రియ పురోగతిలో ఉందని అన్నారు. ఇప్పటి వరకూ తెలంగాణ పబ్లిక్‌సర్వీస్‌కమిషన్ 101 ప్రకటలను, ఇతర నియామక ఏజె న్సీలు 41 ప్రకటనలను జారీచేశారని అన్నారు.

# నూతనంగా నాలుగు మెడికల్ కాలేజీలు

**•రాష్ట్రంలో 34 మెడికల్ కాలేజీల్లో 4,790 సీట్లున్నాయి**

**• మెడికల్ కాలేజీల్లో పెద్దఎత్తున పోస్టులు భర్తీ చేశాం**

**– అసెంబ్లీలో మంత్రి ఈటెల రాజేంద్ర**

హైదరాబాద్, సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ) : తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా నాలుగు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఈటల సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఐదు మెడికల్ కాలేజీలు ఉండేవని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు పెట్టాలని మహబూబ్‌నగర్, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేటలో ఒక్కో కాలేజీని 150 సీట్లతో ప్రారంభించడం జరిగిందన్నారు. కేంద్రప్రభుత్వం ఆధీనంలో ఉన్న కార్మిక శాఖతో సంప్రదింపులు జరిపి ఈఎస్ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆనాడు పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మన ఎంపీలు పోరాడి..బీబీ నగర్‌లో ఎయిమ్స్‌ను ప్రారంభించుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా 11 మెడికల్ కాలేజీలు, ప్రైవేట్ పరంగా 23మెడికల్ కాలేజీలున్నాయన్నారు. వీటిలో మొత్తం 4790 సీట్లుండగా..1640 సీట్లు ప్రభుత్వ కాలేజీల్లో ఉన్నాయని, ఈఎస్ఐ కాలేజీలో 100 సీట్లు, ఎయిమ్స్‌లో 50 సీట్లు ఉన్నాయని చెప్పారు. మెడికల్ కాలేజీల్లో పెద్దఎత్తున పోస్టులు భర్తీ చేశామని ఈటల తెలిపారు. మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు ఇతర సిబ్బందిని పదోన్నతులు, ఇత్తర పద్దతుల ద్వారా భర్తీ చేశామన్నారు.

### పల్లెలను బాగుచేయాలని..

# ఛాలెంజింగ్ తీసుకున్నాం

**• అందులో భాగంగానే 30రోజుల ప్రత్యేక ప్రణాళిక**

**• రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనాలి**

**– అసెంబ్లీలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

హైదరాబాద్, సెప్టెంబర్18(ఆంఎన్ఎ) : పల్లెలను అభివృద్ధి చేయాలని ఛాలెంజింగ్‌గా తీసుకున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దానిలో భాగంగానే సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 30రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమం ప్రతీగ్రామంలో నిర్వహించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులను ఆదుకున్నామని, చెరువులను బాగు చేసుకున్నామన్నారు. కాళేశ్వరంను ఛాలెంజింగ్‌గా పూర్తిచేసుకున్నామని, మిషన్ భగీరథను ఛాలెంజింగ్‌గా పూర్తిచేసుకున్నామని తెలిపారు. 24గంటల కరెంటు అసాధ్యం కానిది సాధ్యం చేసి చూపించామని తెలిపారు. రెండోసారి అధికారం చేపట్టాక గ్రామ సీమలు బాగుచేయాలని ఛాలెంజింగ్‌గా తీసుకుని పెద్దఎత్తున ముందుకు పోతున్నామన్నారు. డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలు, చెత్త సేకరణ, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్ కొనిచ్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నర్సరీలను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీలకు అధికారాలు ఇచ్చాం, నిధులు ఇచ్చాం. నిధుల కొరత లేదని మంత్రి పేర్కొన్నారు.

# కోఆపరేటివ్ సొసైటీల అభివృద్ధికి చర్యలు

**– అసెంబ్లీలో మంత్రి తలసాని శ్రీనివాస్**

హైదరాబాద్, సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ) : సహకార రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు తలసాని సమాధనం ఇచ్చారు. విజయడైరీ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే విజయడైరీకి ప్రభుత్వం నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ను అందిస్తోందని చెప్పారు. అలాగే సబ్సిడీ మీద గేదెలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇటు కోఆపరేటీవ్ సొసైటీలోని కరీంనగర్, ముల్కనూర్, నల్గొండ, రంగారెడ్డి డెయిరీలకు కూడా నాలుగు రూపాయల ఇన్సెంటీవ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పూర్తి తోడ్పాటునిస్తుందన్నారు. విజయ డెయిరీ పాలతో పాటు మరిన్ని ఉత్పత్తులకు ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం విజయడెయిరీకి ప్రభుత్వం రూ.4 ప్రోత్సాహకం ఇస్తోందన్నారు. కాగా ప్రోత్సాహకం ఆలస్యమైతే ఇస్తారా? లేదా? అనే సందేహం వద్దన్నారు. డెయిరీల ప్రోత్సాహకాల కోసం బ్జడెట్‌లో రూ.75 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రైవేటు డెయిరీలు కూడా ప్రోత్సాహకం ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు. పాడి రైతులను ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడిం చారు.

## యురేనియంపై త్వరలో మరోమారు భేటీ

హైదరాబాద్,సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ): యురేనియంపై పోరు విషయంలో టి.కాంగ్రెస్‌లో విభేదాలు చోటు చేసుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే సంపత్ వ్యాఖ్యలను సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్ ఖండించారు. సంపత్ వ్యాఖ్యల పట్ల బాధపడుతున్నట్టు తెలిపారు. తానే చొరవ తీసుకొని పవన్‌తో సమావేశం ఏర్పాటు చేశానన్నారు. ప్రజా సమస్యలపై ఎవరు పోరాడినా మద్దతివ్వాలన్నారు. త్వరలో యురేనియంపై మరో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వీహెచ్ స్పష్టం చేశారు.

## డా।। వద్దేపల్లికి "నాపా" జీవిత సాఫల్య పురస్కారం




శనివారం రాత్రి న్యూజెర్సీ 'రాయల్ ఆల్‌బర్ట్ ప్యాలస్'లో 'నాపా' 6వ వార్షికోత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్నూల్ పార్లమెంట్ సభ్యులైన డా।। సంజీవ కుమార్‌గారు ప్రముఖ సాహితీవేత్తయైన డా।। వద్దేపల్లి కృష్ణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అదే విధంగా శ్రీ వన్నాల శ్రీరాములు, పద్మశ్రీ యస్.వి. రామారావుగార్లను సత్కరించి అభినందించారు. వ్యక్తికన్న సంఘశక్తి గొప్పదని, ఆ సంఘబలం సాధిస్తేనే అన్నిరంగాల్లో విజయం లభిస్తుందని, అత్యధిక సంఖ్యలో వున్న వెనుకబడిన వర్గంలోని పద్మశాలీయులు ముందడుగు వేయాలని ఉత్సాహ పూరితంగా ప్రసంగించారు. "నాపా" నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ అధ్యక్షులైన అంజన్ కర్నాటితో పాటుగా హరికిషన్ ఇప్పన్‌పల్లి, బాలాజీజల్లి, సామల బాబూరావు, ప్రదీప్‌సామల, చిప్ప ప్రభాకర్ ప్రభృతులు సభల్ని నిర్వహించారు. కెనడా, కాలిఫోర్నియా, డాలస్, చికాగో, అట్లాంటా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు తరలి వచ్చి పాలగొన్నారు. డా।।వద్దేపల్లి తన ఆంగ్లానువాద గ్రంథం "ఓమె సోల్, హౌడుయుఫీల్?"ను చంద్రస్వర్గంకు ఆవిష్కరణాంతరం అంకితంగా అందజేశారు. చివరగా ఇందు బాస సాంస్కృతిక కార్యక్రమాలతో జ్యోతి కర్నాటి "మ్యాట్రిమనీ" పరిణయవేదికతో అందరినీ అలరించారు.

# హిందీని రుద్దడం కుదరదు

**– అమిత్ షా నిర్ణయాన్ని అమలు చేయడం అసాధ్యం**

**– అమిత్‌షా వ్యాఖ్యలపై స్పందించిన రజనీకాంత్**

చెన్నై, సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ) : బలవంతంగా హిందీ భాషను దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూడటం మంచిది కాదని తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ అన్నారు. బుధవారం ఈమేరకు ఆయన చెన్నైలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ భాషను అమలు చేయడం అసాధ్యమని అన్నారు. తమిళనాడు సహా దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంపైనా హిందీని బలవంతంగా రుద్దడం సరికాదని చెప్పారు. దేశవ్యాప్తంగా ఒకే భాష ఉండటం మంచిదే అయినప్పటికీ.. విభిన్న సంస్కృతులు, వేర్వేరు భాషలను మాట్లాడుతున్న భారత్ లో అది సాధ్యపడదని అన్నారు. హిందీ మాత్రమే కాదని, ఏ భాషనైనా దేశం మొత్తం మీద అమలయ్యేలా చేయడం సరికాదని రజినీకాంత్ స్పష్టం చేశారు. బలవంతంగా అమలు చేయాల్సి వస్తే.. ప్రజల్లో వ్యతిరేకత మొదలవుతుందని చెప్పారు. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు కూడా హిందీని అమలు చేయడానికి ముందుకు వస్తాయని తాను అనుకోవట్లేదని అన్నారు. ఇదిలా ఉంటే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హిందీని తప్పనసరిగా అమలు చేయాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన పట్ల చెలరేగిన దుమారం ఇప్పట్లో తగ్గేలా లేదు. ప్రత్యేకించి- దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా వామపక్ష పార్టీల నాయకులు ఈ నిర్ణయాన్ని తప్పు పట్టారు. సాక్షాత్తూ భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప సైతం.. అమిత్ షా తీసుకున్న నిర్ణయం సరైనది కాదని తేల్చి చెప్పారు.

కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం, తమిళనాడుకు చెందిన డీఎంకే, మక్కళ్ నీధి మయ్యం అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ దీనిపై స్పందించారు. తాజాగా- ఇదే విషయంపై దక్షిణాది సూపర్ స్టార్ రజినీకాంత్ సైతం తన నోరు విప్పారు. బీజేపీ సానుభూతిపరునిగా గుర్తింపు ఉన్న రజినీకాంత్.. ఆ పార్టీ సుప్రిమో నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడటం ఇదే తొలిసారి.

# పాక్‌ను ఎక్కడుంచాలో మోదీ అక్కడ ఉంచారు

**– 370 అధికరణ రద్దుపై రాహుల్ తనవైఖరిని స్పష్టం చేయాలి**

**– కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా**

జార్ఖండ్, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే 370, 35ఏ అధికరణలను రద్దు చేయడం ద్వారా ప్రధాని మోదీ పాకిస్థాన్‌ను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారని, భారత్‌లో కశ్మీర్ అంతర్భాగమని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. 370 అధికరణకు సంబంధించి కేంద్రం తీసుకున్న నిర్ణయంపై తన వైఖరి ఏమిటో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని అన్నారు. జార్ఖండ్‌లోని జంతరలో బుధవా డు నిర్వహించిన జోహర్ జన్ ఆశీర్వాద్ యాత్రలో అమిత్‌షా మాట్లాడుతూ, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో రాహుల్ పర్యటించేటప్పుడైనా 370 అధికరణపై తన వైఖరి ఏమిటో ప్రజలకు చెబితే బాగుంటుందని అన్నారు. తాము సర్జికల్ దాడులు జరిపినప్పుడు రాహుల్ వ్యతిరేకించారని, వాయిదాడులు జరిపితే సాక్ష్యాలు అడిగారని, దేశాన్ని ఏ దిశగా నడపాలని ఆయన అనుకుంటున్నారో ప్రజలకు ఇప్పుడైనా వివరణ ఇవ్వాలని అమిత్‌షా నిలదీశారు. పవిత్రమైన సంథాల్ పరగణ నుంచి తాము ప్రారంభించిన జన అశీర్వాద యాత్ర రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించే దిశగా తమను తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా తాము రాష్ట్రాన్ని సమూలంగా అభివృద్ధి దిశగా మార్చివేశామని అన్నారు

## డా।।నందిని సిధారెడ్డికి మాతృవియోగం



తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా।।నందిని సిధారెడ్డి మాతృమూర్తి నర్ర రత్నమ్మ(85) శనివారం కన్నుమూశారు. ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరిగాయి. తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా।। ఏనుగు నర్సింహారెడ్డి, కవులు కే.శివారెడ్డి, దేవీప్రియ, దేశపతి శ్రీనివాస్, వర్ఝుల శివకుమార్, బాల శ్రీనివాసమూర్తి, బెల్లంకొండ సంపత్‌కుమార్, బద్దిరాజు ప్రవీణ్‌కుమార్, కె.పి. అశోక్‌కుమార్, వాసిరెడ్డి నవీన్ తదితరులు రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా।।కె.వి రమణాచారి, సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు బాద్మి శివకుమార్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అంత్యక్రియల్లో విశ్వవిద్యాలయం మాజీ వి.సి. ఎస్వీ సత్యనారాయణ తెరసం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నాళేశ్వరం శంకరం, జంటనగరాల తెరసం అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు, తెరసం సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పొన్నాల బాలయ్య, గంభీర్రావ్ పేట యాదగిరి, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, తెరవే మాజీ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, డా।। పి. రాజేశం, అచ్చందత్తు, వేణుశ్రీ, గుర్రాల మాధవ్, బుర్ర మధుసూదన్‌రెడ్డి, మద్దికుంట లక్ష్మణ్, పోరెడ్డి రంగయ్య, బైస దేవదాసు, పి.ఎస్.రవీంద్ర, కల్వకుంట్ల రామకృష్ణ, ఎంపి. కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక శాసన సభ్యులు ఎస్. రామలింగారెడ్డి, సిద్ది పేట జెడ్.పి.ఛైర్మన్ రోజా రాధాకృష్ణ, శర్మ, అంబెడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సీతారామరావు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

హైదరాబాద్, సెప్టెంబర్ 18: రైల్వే ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఈ ఏడాది వారికి 78 రోజుల వేతనాన్ని బోనస్‌గా చెల్లించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ఇవాళ ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.

క్యాబినెట్ మీటింగ్ తర్వాత మాట్లాడుతూ.. సుమారు 11 లక్షల 52వేల మంది రైల్వే ఉద్యోగులకు బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. ఉద్యోగుల్లో ప్రేరణ నింపేందుకు బోనస్‌ను ప్రకటిస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొన్నది. తమ ప్రభుత్వం గత ఆరేళ్ల నుంచి రికార్డు స్థాయిలో రైల్వే ఉద్యోగులకు బోనస్ ఇస్తున్నట్లు మంత్రి జవదేకర్ తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



సింధుగ కవితా దుగ్ధము
పిండగ - విదుసైన బోయి భీమన్న కవిగ
దండిగ సామాన్యులకై
భండనమిడ - భవుడా నర్సు - ప్రభూతముగనే!!



( సెప్టెంబర్ 19 బోయి భీమన్న జయంతి)

–రాధశ్రీ

సెల్: 9494481210


రంజని,

తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్ 500004



### నేటినిజం దినపత్రిక -రంజని

### విశ్వనాథ పద్య కవితా పోటీలు 2019

మఱల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల నెల్ల వేళ
దినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళుతనరుచి బ్రదుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
తలచిన రామునే తలచెద నేనును నా భక్తిరచనలు నావిగాన...

అన్న "మాటలాడే వెన్నెముక, పాటపాడే సుషుమ్న, నిన్నటి నన్నయ్యభట్టు, ఈనాటి కవిసామ్రాట్టు, ప్రధమ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ". ఆయన పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ లేదు, మెట్టి చూడని సారస్వతమూ లేదు. "సంస్కృతంలో ఇప్పుడు వ్రాస్తే ప్రాచీన కవుల పరంపరలో ఏ వెయ్యిన్నొక్కటో వాణ్ణి అవుతాను. తెలుగులోనంటారా పన్నెండుగురు ప్రాచీన మహాకవుల తర్వాత పదమూడో వాణ్ణి నేను " అని స్వయంగా ప్రకటించుకున్నట్లే శిల్ప వైలక్ష్యంలో, భావన సౌకుమార్యంలో, దేశిచ్ఛందో విశేషంలో, కల్పనా సాహిత్యంలో విశ్వనాథ వారి తరువాతే ఎవరైనా.

'గిరి కుమారుని ప్రణయ గీతాలు' ఆయన తొలి కవిత. ఆ తరువాత ఆంధ్ర ప్రశస్తి , ఋతుసంహారం, రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు రాసారు. కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి, టానిసల దీవి, ఉయ్యాలతాళ్లు వంటి గేయ కావ్యాలు, ఏకవీర, వేయిపడగలు, చెలియలికట్ట, బద్దన్నసేనాని, సముద్రపుదిబ్బ, మ్రోయుతుమ్మెద వంటి నవలలు, నర్తనశాల, సౌప్తిక ప్రళయం, అనార్కలి, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం వంటి నాటకాలు, శర్మిష్ఠ వంటి సంస్కృత నాటకాలు, ఎన్నో కథలు, పురాణవైర గ్రంథమాల పేరుతో ఎన్నో నవలలు...మొత్తం లక్ష పుటలకు పైగా సాహిత్యం అందించిన విశ్వనాథ సత్యనారాయణ గారు ' రంజని' ని ఎన్నో పర్యాయాలు సందర్శించారు. అకౌంటెంట్ జనరల్ గా పదవి విరమణ చేసి అమెరికాలో ఉంటున్న శ్రీ ఏ. సత్యవర్ధన, IA & AS గారి సౌజన్యంతో రంజని తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణ పేరు మీద 2008 నుంచి '**రంజని- విశ్వనాథ పద్య కవితా పోటీలు**' నిర్వహిస్తోంది.

బహుమతులు : ప్రధమ బహుమతి రూ. 2,000/- , ద్వితీయ బహుమతి రూ. 1,500 /- మూడు తృతీయ బహుమతులు (500/-) మొత్తం 5,000/- (యోగ్యతాపత్రాలతో సహా)

నిబంధనలు: ఏ ఛందస్సు లోనైనా ఒక అంశం మీదే 12 పద్యాలకు తక్కువ కాకుండా ఉండాలి. సామాజికత తప్పనిసరి. ఇంతవరకు ప్రచురణ, ప్రసారంకానివి, దేనికి అనువాదం, అనుక(స)రణ కాని పద్య కవితల్ని మాత్రమే పంపాలి. ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విడిగా జతపరచాలి. ఒకరు ఎన్ని పద్యకవితాలైనా పంపవచ్చు. పద్యకవితాల్ని కాగితంపై ఒక వైపే రాయాలి. పద్య కవితలు పంపే కవరు పై ' రంజని-పద్యకవితా పోటీలు- 2019' అని పేర్కొవాలి. పద్యకవిత ఉన్న కాగితం పై పేరు, విలాసం తదితర వివరాలు వ్రాయకూడదు. పూర్తిపేరు, చిరునామా వివరాలు హామీ పత్రంలో మాత్రమే పేర్కొనాలి. విజేతలకు ఫలితాలను నేరుగాను, పత్రిక ముఖంగాను తెలియచేస్తాం. ఎంపికైన పద్యకవితలను ప్రచురించే హక్కు రంజనిదే. న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

చిరునామా: ప్రధాన కార్యదర్శి, రంజని, తెలుగు సాహితి సమితి, ఏ.జి ఆఫీస్ , సైఫాబాద్, హైదరాబాద్— 500004.

చివరితేదీ: 31 అక్టోబర్ 2019

నందిరాజు పద్మలత జయరాం
అధ్యక్షులు
9492921383

మట్టిగుంట వెంకట రమణ
ప్రధాన కార్యదర్శి
83748

# బాల వికాసం

నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల తడపాకల్ జడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థులు రాసిన కవితలు ఈ వారం నేటి నిజం పాఠకుల కోసం..

– సంపాదకులు

## వర్షం పడని రోజు

ఓ వర్షమా నిన్ను ఏమని వర్ణించను!
కారు మబ్బుల చీకట్లో దాగున్నావు
కటికపాటి నిద్రలేకుండా ఉక్కపోతతో
ఉక్కిరి–బిక్కిరి అయ్యాము
మా కళ్ళు కాయలు కాసేలాగా
ఎదురుచూసాము
యిప్పుడు నీ రాకతో
మా కళ్ళలో ఆనందం ఉప్పొంగి
రైతన్న గుండెల పంటలు పులకించెను
నీ తొలిజల్లులు
మా అన్నదాత పంటకు
తొలకరి చిరుజల్లులు
కోటి జీవులకు బతుకునిచ్చావు
చల్లని వాతావరణంలో
వేడి, వేడి కాఫీమత్తు
పకోడి గమ్మత్తు
కప్పల బెక, బెకలు
ఈ ఒక్కరోజే నీ రాకనా?
అయితే అన్నదాత దారెటు?



– ఇ. సౌమ్య
19వ తరగతి
జి.ప.సెం. పాఠశాల
తడపాకల్, ఏర్గట్ల
నిజామాబాద్

## వాన పడిన రోజు

వాన పడిన రోజు
పుడమి పులకరిస్తుంది
రైతు ఎంతో సంతోషంతో
పంటలు పండిస్తాడు
వానతో నిండిన వాగులు
రూతన్నను కంటతడి పెట్టించవు
వానలు పడటంతో
భూమి హాయిగా ఉంటుంది
వాన పడిన రోజు
వాగులు నిండుతాయి
రైతు నాగలి పట్టి పొలం దున్నుతాడు
వాన పడిన రోజు
అడవిలో ఉన్న జంతువులు
ఆనందంగా ఉంటాయి
ప్రకృతి పరవశిస్తుంది
పక్షులు
ఆనందంతో ఉండాలంటే
వాన పడాలి
పంటలు పండాలి అంటే
అవసరం వాన
వాన పడాలం అంటే
అవసరం కాన.

– డి. అనూష
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
తడపాకల్

## మహిళ మణి

మాటకందని మహావరం మహిళ
నింగంత నెలంత మహిలై
నడయడే దైవ రూపం మహిళ
మహిళంటే ముందుకు అడుగు కాని
వెనకడుగు కాదు
ఎన్నో పోరాటాలు చేస్తు
మన భారత దేశాన్ని ముందకు నడుపుతూ
పోరాడేది మహిళలు
ఈ భూమికి గొప్పవరం మహిళ
ఈ రూపానికి గొప్ప దైవం మహిళ
ఎవరెస్టు శిఖరం ఎక్కిన మాలావత్ పూర్ణ
బాల్ బ్యాట్‌మెంటన్ అంతర్ జాతీయ
స్థాయికి వెళ్ళిన సింధు
అంతరిక్షంలోకి వెళ్ళిన సునిత విలయం
పరుగుల్లో ముందు ఉన్న పి.టి. ఉష
కోకిలలాగా పాట పాడే మంగ్లీ
ఈ మహిళలు ఎంతో ఉత్తేజంతో
ఉత్సవంతో పేరు తెచ్చిన మహిళలు
గలగల లాడే గోదావరి,
చమ చమలాడే నక్షత్రాలలా
ఆకాశం అంత ఎత్తు ఎక్కిన మహిళలు
ప్రకృతితో మెరిసే పల్లె
పచ్చదనం మెరిసే ప్రకృతి
మనిషి మాటతో మెరిసె మహిళ
అందుకే మహిళంటే అందరి
దృష్టిలో గొప్ప దేవతా...!



– యం. పౌనిక
10వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్
ఏర్గట్ల, నిజామాబాద్



## నిజాయి!

ఏరుదాటే వరకే.."మనం"–
ఏరుదాటాక తెప్పతగలేయుట మానం.
కవిత్వం కచ్చితంగా ఎక్కుద్ది–
కలం గుండెలో ముంచి రాస్తే.
నిర్లక్ష్యంతో..వాడితే...నీరు–
పెట్టిస్తుంది...నిర్దాక్షిణ్యంగా కన్నీరు.
అన్నమూ చంపేస్తుంది–
అసలే లేకున్నా..ఆబగా తిన్నా.
విశ్వనగర నిర్మాణం–
భాగ్యనగరమొక తార్కాణం.
మహాసముద్రాలు ఇంకిపోవు–
నా కంటి ఊట ఆగనంతవరకూ.
సలసల కాగే నల్లమల–
నిలువునా కాల్చే యురేనియం నిల్వల వల్ల.
విచ్చలవిడి కామదాహం–
ప్రభుత పర్యవేక్షణా వైఫల్య నేపథ్యంలో.
అనాథ పసి బాలలు–
సంరక్షక వికృత కామాన్కి సమిధలౌతూ.
సంపద పెంచితే..ధనికుడు–
ఉన్నంతలో పంచితే..శ్రీ మంతుడు.
కోల్పోతేనేం..సర్వం–
ఒక్కటి మాత్రం గుండెలో..నింపుకో..'ధైర్యం'.



–గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## వంశీరామరాజు, డా॥సుధారాణి దంపతులకు ఆత్మీయ సత్కారం




ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ అభినందన ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ సౌజన్యంతో శుక్రవారం కళాసుబ్బారావు వేదికలో వంశీ సంస్థల వ్యవస్థాపకులు, సాంస్కృతిక సేవాకళా రంగాల ప్రముఖులు డా॥ వంశీ రామరాజు, రచయిత్రి, గ్రంథకర్త డా॥ తెన్నేటి సుధాదేవి దంపతులకు స్వర్ణోత్సవ దంపతులుగా ఆత్మీయ సత్కారం చేశారు. డా॥ వంశీ రామరాజుకు స్వర్ణోత్సవ సాంస్కృతిక రథసారథిగా అభినందన కల్చరల్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. డా॥ రామరాజు, డా॥సుధాల ఐదు దశాబ్దాల సుదీర్ఘ సాహిత్య సాంస్కృతిక కళారంగ సేవలను ప్రస్తుతించారు. ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి విచ్చేశారు. జయశంకర్ టీవీ ఛానల్ సీఈఓ డా॥ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి డా॥ కేవీ కృష్ణకుమారి, గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి తదితరులు హాజరయ్యారు.

## రైతు గొప్పవాడు

రైతు గొప్పవాడు ఎందుకంటే
మనందరికి అన్నం పెడతాడు
వర్షం పడుతుంటె ఎంతో ఆనందిస్తాడు
ఆ వర్షంలోనే చిందులేస్తు
చాలా కష్టపడుతుంటాడు
అదంత ఎవరికోసం అనుకుంటున్నారు
తన కోసం కాదు మన కోసం
మన దేశ ప్రజల కోసం
రైతు పది వేళ్ళు భూమిలోకి వెళ్తేనే
మన ఐదు వేళ్ళు మన నోట్లోకి వెళ్తాయి
అందుకె రైతును మన దేశానికి
వెన్నెముక అంటారు
ఎండలో, వానలో తడుస్తు
రేయింబవళ్ళు మన కోసం కష్టపడుతుంటాడు
అలాంటి రైతు ఎంత గొప్పవాడు.



– సి.హెచ్. కళ్యాణ్
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్.
తడపాకల్



## స్నేహ బంధం

స్నేహం అనే పదం లోకంలో గొప్పనైనది
ఇద్దరు కలిసి మెలసి ఉండేదే స్నేహం
ఒకరితో స్నేహం చెయ్యాలంటే
కావాల్సింది నమ్మకం
ఎవరితోనన్న స్నేహంగా ఉండాలంటే
కావాల్సింది నమ్మకం
మనకు ఆపద వస్తే
ఆదుకునే వాడే స్నేహితుడు
కష్టం వచ్చినప్పుడు తోడుండేవాడు
బాధవచ్చినప్పుడు తీర్చేవాడు
మాకది కావాలంటే ఇచ్చేవాడు
ఎల్లప్పుడు మనల్ని ఆనందంగా ఉంచేవాడు
తన బాధను పంచుకునేవాడు
ప్రతీక్షణం మనతో కలిసుండేవాడు
నిజమైన స్నేహితుడు
స్నేహం ఇచ్చే ఆనందం
మరువలేని జ్ఞాపకం.



– ఎ. గ్రీష్మ
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్

## అమ్మ ప్రేమ

పేగుబంధం అమ్మ
మనల్ని లాలించేది అమ్మ
జోకొట్టిన నవ మాసాలు మోసింది అమ్మ
మనకు గోరుముద్దలు
పెట్టేది అమ్మ
మనకు దెబ్బ తగిలితే అరిచేది అమ్మ
గొప్పవాడైతే ఆనంద పడేది అమ్మ
అమ్మ అనే పదం
అమృత వాక్యం
నాన్న అనే పదం
నవ్వ రసం
స్నేహం అనే పదం చేతికి
పంచే భావం
ఏ= అనుక్షణం
ఎం= మన గురించి
ఎం= మనసులో
ఎ= ఆలోచించేది అమ్మ
అనుక్షణం మనగురించి
మనసులో ఆలోచించేది మన అమ్మ
అందరి ప్రేమ ఒక ఎత్తు
అమ్మ.. ప్రేమ ఒక ఎత్తు
అలాంటి.. అమ్మను మరువకు సుమా..!

– మాలావత్. పౌనిక
10వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. తడపాకల్
ఏర్గట్ల, నిజామాబాద్



## ఓ..నేల తల్లి

పచ్చని పొలాల్లో పులకరిస్తున్నావో
కమ్మని కలల్లో కలవరిస్తున్నావో
మేము నడిచే పాదాలు ఎలా బరిస్తున్నావో
అది నువ్వే
ఓ.. నేల తల్లి
మనం అందరం ఎదో తప్పు చేసిన కాని
సహించే తల్లి
అదే అదే మా నేల తల్లి
మన అందరిని సృష్టించింది దేవుడు అయితే
కంటికి రెప్పలా కాపాడేది మన నేల తల్లి
ప్రజల ఆనందాలను పలకరించే
ఓ.. భూ తల్లి
ప్రజలను కన్నతల్లి లాగా చూసుకునే తల్లి
అదే మా భూ తల్లి
ఆత్మీయ అనుబంధాలు
కలిసినప్పుడు అనుబంధాలు
కలిసినప్పుడు వచ్చేది
అదే మన భూ మాత



– యం. మీనాక్షి
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్, తడపాకల్



## వాన చినుకు


నేలపై రాలుతు
రైతు గుండెల్లో
ఎన్నో ఆశల భవంతుల్లో
సూర్యకిరణం వలే కలుస్తుంది
ఏడు రంగుల ఇంద్రధనస్సుతో
హరివిల్లులా మారుతుంది
ఆనందం ఇచ్చె అనుభూతుల వలే
ఆకాశం అంత మన రైతుల గుండే తల్లడిల్లుతు
ఆకాశం మొత్తం పరుచుకుంటుంది
ఉరుముల మెరుపులతో
గడగడలాడే పెద్ద శబ్దాలతో
కుందపోత వలే మనకు వర్షం వస్తుంది
మన రైతులందరు మన కడుపులు
నింపాలనే కృషితో
పంటలను మొదలు పెట్టారు
ఇంత వర్షం పడుతుందంటే
కారణం
చెట్లు
చెట్లె లేకపోతే ఇప్పుడు ఈ వర్షం పడదు
రైతు మన కడుపులు నింపడు
అందుకే
చెట్లను పెంచుదాం.. కానీ
ఆ చెట్లను నరకవద్దు
ఎందుకు చెట్లను పెట్టడంలేదు
అదే చెట్లు వైపై ఇస్తుందంటే
ఇంటికో 10 చెట్లు నాటుతారు
కావొచ్చు
అలా చేయకండి కాలుష్యం అవుతుంది
ఇంత వర్షం పడుతుంది కాబట్టి
ఇంకా మనకు వర్షం కావలంటే
10 చెట్లు మన రైతుల కోసం
నాటుదాం
మన రైతు కన్నీటిని ఆపుదాం
రైతే కన్నీరు పెడితే
మన బతుకులు బష్టాండులే.



– యల్.రజిత
10వ తరగతి,
జి.ప.సెం. పాఠశాల,
తడపాకల్, నిజామాబాద్

## ప్రకృతి

పక్షుల కిలకిల రావాలతో
స్వచ్ఛమైన గాలితో
అందమైన పూలతో
పచ్చ పచ్చని చెట్లతో
పులకరించింది ప్రకృతి
పరవశించింది ప్రకృతి
మూగజీవుల ప్రేమతో
ఆప్యాయంగా పలకంచింది
అనురాగాన్ని అందించి
ఆహ్లాదాన్ని ఇచ్చింది ప్రకృతి
మన జీవితాన్ని ఆస్వాదిస్తు
సంతోషాన్ని పంచుతూ
సుందరలోకాన్ని తెస్తుంది ప్రకృతి



– డి. స్నేహ
10వ తరగతి
జి.ప.సెం.ప. తడపాకల్
ఏర్గట్ల, నిజామాబాద్

## నాన్న ప్రేమ

ధైర్యాన్ని అందించేది మా నాన్న
నాకు తోడునీడగ ఉంటూ
ఒంటరిగా ఉన్న మనల్ని
ఒడిలో చేర్చుకుని
మంచి మంచి కథలు చెబుతాడు
ధర్మమార్గాలలో నడ్పించుతూ
మనల్ని ఎల్లప్పుడు ఆనందంగా
ఉంచుతూ ఉండేది మా నాన్న
నాతో అల్లరి చేస్తు
నేను ఏడిస్తే నన్ను ఓదార్చుతూ
మంచి మాటలను నేర్పించుతూ
మన జీవితాన్ని సరైన దారిలో
నడిపించుతాడు
మనతో ఎంతో ఉల్లాసంగా ఉంటాడు
మనం ఆనందంగా ఉంటే
నాన్న ఆనందంగా ఉంటాడు
ఆడుతూ, పాడుతు, నవ్వుతూ
మనతో హాయిగా ఉంటాడు మా నాన్న.



– బి.రసజ్ఞ
10వ తరగతి
జి.ప.సెం.పాఠశాల
తడపాకల్
ఏర్గట్ల, నిజామాబాద్

## వాన పడిన రోజు

తొలకరి వాన పడింది
నేలంతా పులకరించింది
పచ్చని ప్రకృతి చిగురించింది
రైతన్నకు ఆనందాన్ని ఇచ్చింది
చెరువులు కుంటలు నిండాయి
అందరికీ నీటి బాధ తీర్చాయి
జంతువులకు దాహం తీర్చింది
పుడమిని చల్ల బరిచింది
అందరికి సంతోషాన్ని ఇచ్చింది
కర్షకుని నాగేలు కదలి ముందుకు సాగింది
రైతుల కష్టాలు తీరాయి
అందరికి ఆకలిని తీర్చాయి.



– డి. అభిలాష్
9 వతరగతి
జడ్.పి.హెచ్.ఎస్.
తడపాకల్

## చెట్లు

అవును చెట్లు అంటే అందరికి ఇష్టమే
చెట్లు లేనిదే జీవం లేదు
చెట్లు బ్రతికినన్నాల్లు మనకు
కూర్చోవడానికి నీడ
పూజకు పువ్వులు
గమ్యం తోరనాలకు ఆకులు
తినడానికి పండ్లు
మన రోగానికి ఔషధం చెట్లు
మన జీవితానికి ఆయుధం చెట్లు
చెట్లు చనిపోయాక మన ఆకలి తీరుస్తుంది
చెట్టుకు మనం నీరు పోసి పెంచుతే
మనం నారేసిందానికి అది వర్షారూపంలో
నీరు పోసి నిలుపుతుంది.

– ఎ. గ్రీష్మ
8వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్ః
తడపాకల్




ఇటీవల నిజామాబాద్‌లోని మహిళా కళాశాలలో జరిగిన 'ఇందూరు భారతి' స్వర్ణోత్సవాల సందర్భంగా పార్లమెంటు మాజీ సభ్యుడు యం. నారాయణరెడ్డి, రచయిత డా॥శారద హన్మాండ్లుకు పురస్కార ప్రదానం చేస్తున్న డా॥నాగభూషణం గుప్త, శ్రీపాద కుమారశర్మ, ఎ.సూర్యప్రకాశ్, డా॥ వసుందరాదేవి, జిల్లా కలెక్టర్ యం. రామమోహనరావు, నెల్లుట్ల రమాదేవి, డా॥త్రివేణి, డా॥ అమృతలత తదితరులు.



## వర్షం పడని రోజు

ఆ రోజు సూర్యుడు ఉదయించాడు
తాగడానికి చుక్క నీరైనా లేదు
వర్షం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు
రైతు కళ్ళల్లో కన్నీరు స్పష్టంగా ఏర్పడుతుంది
వర్షం పడలేదు కానీ
రైతుకన్నీరు మాత్రం మిగిలింది
ఎప్పుడూ మిక్కిలి సంతోషంగా ఉండే జనం
ఆ రోజు త్రాగే నీరు లేక అల్లాడిపోయారు
ఆ ఎండకు, వేడికి సతమతమైపోయారు
ఎప్పుడూ పచ్చగా ఉండే చెట్లు
ఆ రోజు ఎండిపోయాయి
జనాలందరికి ప్రశాంతత కరువైంది
ఉక్కపోతతో ఎంతోమంది ఉబికిసలాడారు
చల్లటి గాలి కోసం, పచ్చటి నేల కోసం
శీతలమైన వాతావరణం కోసం
ఊరి జనాలందరూ ఎదురు చూస్తున్నారు.



– చిలుక శ్రవణ్
10వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
తడపాకల్.

## రైతు కన్నీరు

రైతులు దేశానికి వెన్నముక అంటారు
కానీ, రైతులే కన్నీరు పెడ్తున్నారు
వర్షాలు పడక రైతు కన్నీరు
రెయి పగలు కష్టపడిన
చలిలో వనికిన
వర్షంలో తడిచిన
కష్టపడుతూ పంటలు పండించుతూ
పండిచ్చిన పంటకు మద్దతు ధర ఇవ్వక
రైతు కన్నీరు చూస్తున్నారు
ఒకప్పుడు రైతు రాజు అనేవారు
కానీ, ఇప్పుడు రైతే దేశానికి కడుపునింపితే
రైతే పేదవాడైతున్నాడు
దేశానికి ఏమి చేయనివారు ధనవంతులు
దేశాలకి ఆకలి తీర్చేవాడు గరీబు
రైతుల కుంట కన్నీరు రావద్దు
పంటలకు మద్దతు ధర ఇచ్చి
వర్షం పడేటట్లు చెట్లు నాటండి
రైతుల మొకంలో సంతోషాన్ని చూడండి
రైతు సంతోషంగా ఉంటే
ఈ దేశం సంతోషంగా ఉంటుంది.



– యం. జాహ్నవి
10వ తరగతి
జి.ప.సెం.ప. తడపాకల్
ఏర్గట్ల, నిజామాబాద్

## వర్షం పడని రోజు

ఆ రోజు
సూర్యుడు అలా ఉదయించాడు
ప్రపంచాన్ని మేలుకొలిపాడు
ప్రపంచమంతా
నీటి కోసం పరుగులు పెడుతంది
నీళ్ళు దొరకక తిరుగుడు, ఎంత తిరిగిన
త్రాగడానికి చుక్క నీరు లేదు
ఉక్కదుందామన్న నీడ లేదు
చెట్లన్ని ఎండిపోయాయి
మేఘాల నీరు వస్తుంతదని చూసిన
నీరు లేదు కాని
రైతు కన్నీరు మస్తుగానే ఉంది
ఎండలు మండుతున్న సమయమిది
ఎక్కబోతతో ఊపిరి సక్కగా ఆడడం లేదు
ఆ ఉక్కబోతకైన వానదేవుడు
కరుణిస్తాడేమో అనుకున్నది ప్రపంచం
కరుణించలే
అలా అలా
సూర్యస్తమయం అయింది
ఉరుము మెరుపులు ఉన్నాయి
ఉన్న చెట్లు ఊగుతున్నాయి
అప్పుడు కొంచెం సంతోషం వచ్చింది
వర్షం పడుతుందేమోనని
అలా అలా సంవత్సరాలు గడిచాయి
వాన చినుకు లేదు
ఒక్క నీటి బొట్టులేదు
రైతు గుండె విలవిలలాడుతుంది
భూమి భగ భగ మండుతుంది
అప్పుడు తెలుసుకున్నారు
చెట్లు ఉంటే వర్షాలుంటాయని
అప్పటి నుండి
అందరు కలిసి
మొక్కలు నాటడం ప్రారంభించారు
మొక్కలు పెరిగి వృక్షాలయ్యాక
వానలు కురిసాయి
వారు ఈనాటి సమస్యని తప్పించుకున్నారు
నీటి విలువ తెలుసుకున్నారు
నీటిని కాపాడి,
వారి ప్రాణం వారు నిలుపుకున్నారు.



– యం.డి. సమ్రీన్
10వ తరగతి
జి.ప.ఉ.పాఠశాల
తడపాకల్, ఏర్గట్ల
నిజామాబాద్.

నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

గురువారం 19-9-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3


నమ్మలేని నిజాలు

అణు సమయం
జీవ ప్రకృతి ధ్వంసం
రాక మానదు

యూరియా బస్తా
ఉస్సూరుమంది ప్రాణం
పంపిణీ లోపం

బంగారు బంతి
దేశం సిగలో బంతి
సింధూర రాగం

కంటి కిటికి
తెరిచిస్తే చరిత్ర
లిఖిస్తే చిత్రం

చపాతీ ఉప్పు
నిజానికి సంకేత
పాపం పిల్లలు

– రేడియమ్
9291527757



శ్రీనిజాలు

ప్రకృతి శోభ చూసేందుకు
పాపికొండల టూరు!
వెళ్ళి చూస్తే ఏమున్నది
మహా రక్కసి నోరు!

నట్టనడుమ నదిలోపల
నట్టివిరిగి మునిగె బోటు!
గల్లంతైనోళ్లకు ఇక
లేదు నేలమీద చోటు!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



# విముక్తికై పల్లవించిన స్వేచ్ఛాగీతం సుద్దాల హనుమంత



– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

**జానపద సంప్రదాయ కళా ప్రదర్శనకు బుర్రకథకు తెలంగాణ ప్రాంతంలో పితామహుడిగా ప్రసిద్ధి పొందిన గొప్ప కళాకారుడు, విశిష్ట వ్యక్తి సుద్దాల హనుమంత జ్ఞాపకార్థం బుర్రకథా సప్తాహం ప్రారంభమైంది. త్యాగరాయ గానసభ అధ్యక్షులు కళా జనార్థనమూర్తి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో 13 శుక్రవారం నుండి 19 గురువారం వరకు జరిగే ఈ బుర్రకథ సప్తాహంలో బండిరాజుల శంకర్, గుమ్మడిపల్లి సైదులు, ఆకుల శ్రీనివాస్‌గౌడ్, తాడూరి శ్రీనివాస్, నక్కఉప్పలయ్య, గంధం వెంకటేశం, శ్రీమతి కూకట్ల లలితలు ఒక్కొక్కరు ఒక్కొక్కరోజు బుర్రకథ వినిపిస్తున్న సందర్భంగా సుద్దాల హనుమంత గురించి ప్రముఖ రచయిత డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు రాసిన వ్యాసం నేటినిజం పాఠకుల కోసం..**

–సంపాదకులు


తెలంగాణలో ఒక మారుమూల పల్లెటూరు. ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఒక తరగతి గది. ఆ గదిలో ఉన్న పిల్లలందరి కళ్లవెంట ధారాపాతంగా కన్నీరు. కొందరి గొంతు నుండి వెక్కిళ్ల చప్పుడు.. ముందు చిన్నగా మొదలైన ఆ స్వరానికి మరికొన్ని గొంతులు తోడయ్యాయి. ఉలిక్కిపడ్డ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరుగుపరుగున ఆ తరగతికి వెళ్లిచూశారు. అక్కడ కనబడ్డ దృశ్యాన్ని చూసి, కలవరపాటుకు లోనయ్యారు. పిల్లలందరి కళ్లవెంట ఆగకుండా కన్నీరు ప్రవహిస్తూనే ఉంది. కొందరు కన్నీటిని తుడుచుకుంటున్నారు. మరికొందరు వెక్కిళ్లను బలవంతంగా ఆపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతగా ఆ తరగతిలోని పిల్లలను ప్రభావితం చేసిన కారణం ఆ తరగతి ఉపాధ్యాయుడు పాడిన పాట. ఆ పాటే 'పల్లెటూరి పిల్లగాడ'. ఆ పాటను రాసిన రచయిత సుద్దాల హనుమంతు.

ఈ దృశ్యం కేవలం ఆ ఒక్క తరగతిగదిదే కాదు. ఆ పాట ఎప్పుడు వినబడ్డా ఆ పల్లెటూరి పిల్లగాడిగా తనను ఊహించుకుంటూ, తన బాధలను పాట రూపంలో వింటూ, పూర్తిగా లీనమైపోయే పిల్లలెందరో. 'సుకవి మరణానంతరం కూడా తన రచనలతో జీవించేఉంటాడు' అన్న ఆర్యోక్తికి ఉదాహరణగా ఊపిరి ఆగిపోయిన 37 ఏళ్ల అనంతరం కూడా ఆ గొప్ప కవి సుద్దాల హనుమంతు పాటలు ఉద్యమాలకు ఊపిరిపోస్తున్నాయి. ప్రజలను ఉద్యమోన్ముఖులను చేస్తూనే ఉన్నాయి.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని తన పాటలతో చైతన్యంవైపు నడిపించిన ప్రజాకవి సుద్దాల హనుమంతు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగు ఆయన స్వగ్రామం. గుర్రం బుచ్చిరాములు, లక్ష్మీనరసమ్మ దంపతుల సంతానంగా జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యం చేసేవారు. ఇంటిపేరు గుర్రం అయినప్పటికీ అనంతర కాలంలో గుండాల మండలం సుద్దాలలో నివసించడంతో ఆయన ఇంటిపేరు 'సుద్దాల'గా మారింది.

ఆనాడు చదువుకునేందుకు పెద్దగా అవకాశాల్లేకపోవడంతో వీధిబడిలోనే చదువుకున్నారు హనుమంతు. బాల్యంలోనే కళలన్నా, సాహిత్యమన్నా మక్కువ ఏర్పడింది. ఆ రోజుల్లోనే శతకాలు, కీర్తనలు, పద్యాలను కంఠస్థం చేశారు. యక్షగానాల్లో పాత్రలు పోషించారు. చిన్ననాటి నుండే పాటలు పాడడం నేర్చుకున్నారు. నాటకాలపై ఆసక్తి పెంచుకున్నారు. ప్రాణాయామం, యోగాలను కూడా నేర్చుకున్నారు. హరికథకుడు అంజనదాసు శిష్యరికం చేశారు. ఆయన బృందంలో చేరారు. బాల్యం నుండి చైతన్యవంతమైన నాటకాలను ప్రదర్శిస్తూ ప్రజా చైతన్యానికి బాటలు వేశారు. పాటలు రాయడంతో పాటు వివిధ సందర్భాల్లో పాడుతూ ఉద్యమాలకు దివిటీ అయ్యారు.

భువనగిరి వాస్తవ్యులు ఉత్పల వెంకటరావుకు శిష్యుడిగా మారిన హనుమంతు ఆయన ప్రభావం వల్ల తొలి దశలో ఆర్యసమాజం వైపు మొగ్గు చూపారు. ఆర్యసమాజంలోని వారు నిజాం ప్రభుత్వం దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయడం హనుమంతును ఆకర్షించింది. బాల్యం నుండి తాను చూస్తూ వస్తున్న అనేక సమస్యలకు ఆర్యసమాజం దారి చూపిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన ఏర్పరచుకున్నారు. ఆ ప్రభావం వల్ల వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా కృషిచేశారు. దళితులకు అండగా నిలబడ్డారు. విధవా పునర్వివాహాలను జరిపించారు. రెండేళ్లు దళితులకు విద్యాబోధన చేస్తూ వరంగల్‌లో గడిపారు.








మొదటిరోజు శుక్రవారం జ్యోతి వెలిగిస్తున్న రోశయ్య. చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ, కళా జనార్ధనమూర్తి, బండిరాజుల శంకర్ తదితరులు ○ రెండవ రోజు శనివారం గుమ్మడిపల్లి సైదులును సత్కరిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు, కళాజనార్ధనమూర్తి, బైస దేవదాసు, శ్రీనివాస్ తదితరులు.

రాజేంద్రనగర్ సమీపంలోని బుద్వేల్‌లో వ్యవసాయశాఖ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరారు హనుమంతు. కానీ ఆ ఉద్యోగం నచ్చకపోవడంతో కొద్దిరోజుల్లోనే రాజీనామా చేశారు.

భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ సమావేశాలు హనుమంతు జీవితంలో ఒక మలుపు. ఆ సభల్లో క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించారు. ఆ సభల్లో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, పెండెం వాసుదేవ్, వట్టికోట ఆళ్వారుస్వామి, ఆరుట్ల రామచంద్రారెడ్డి మొదలైన ప్రముఖుల ఉపన్యాసాలు ఆయనను అమితంగా ప్రభావితం చేశాయి. ఆ ప్రభావంతో ఆయుధాన్ని కూడా చేపట్టారు. కమ్యూనిస్టు పార్టీ దళ సభ్యునిగా హనుమంతు తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారు. వివిధ గ్రామాల్లో సంఘాలు స్థాపించారు. సభలు, సమావేశాలను నిర్వహించారు. పాటలతో ప్రజల్లో ఉత్తేజం నింపారు. ఆంధ్ర మహాసభ ఆధిపత్యం క్రమంగా కమ్యూనిస్టుల ఆధీనంలోకి వెళ్లడంతో సుద్దాల హనుమంతు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మారారు. సంఘం కార్యక్రమాలను ప్రచారం చేస్తుండడంతో పాటు నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయడంతో ఆయనపై అరెస్ట్ వారెంటును జారీ చేసింది నిజాం ప్రభుత్వం. ఫలితంగా హనుమంతు అజ్ఞాతవాసంలోకి వెళ్ళారు.

ప్రజాకళారూపాలను ఉద్యమానికి ఊతంగా తీసుకున్నారు సుద్దాల హనుమంతు. బుర్రకథ, హరికథ, యక్షగానాలను తెలంగాణ సాయుధ పోరాటానికి సాధనాలుగా ఉపయోగించుకున్నారు. హైదరాబాదు సంస్థానం పరిధిలో భూస్వాముల దురాగతాలను బుర్రకథల రూపంలో చాటిచెప్పారు. 'హనుమంతు బుర్రకథ చెబితే గడ్డిపోచ కూడా యుద్ధానికి సిద్ధమయ్యేద'న్న ప్రచారం నాటి రోజుల్లో ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది. విచిత్ర వేషాలు, గొల్ల సుద్దులు, ఫకీరు వేషం మొదలైనవాటి ద్వారా పీడిత ప్రజానీకం ఎదుర్కొంటున్న బాధలకు రంగస్థల రూపం కల్పించారు. తద్వారా ప్రజల్లో భావ వ్యాప్తి కలిగించి, ఉద్యమాల్లో పాల్గొనేలా ప్రేరేపించారు.

రజాకార్ల దుశ్చర్యలకు జవాబిచ్చేందుకు తన పాటలను ఆయుధంగా మలిచారు. 'వెయ్‌దెబ్బ' అనే పాటతో ప్రజల కర్తవ్యాన్ని ఉద్బోధించారు. వెట్టిచాకిరీపై ఆయన రాసిన 'పల్లెటూరి పిల్లగాడ– పాలబుగ్గల జీతగాడ' పాట వాడవాడలా ప్రతిధ్వనించింది.

**నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కలం, గళం ఆయుధాలుగా పీడితులకు మద్దతుగా నిలిచిన ప్రజాకవి హనుమంతు. పీడిత జన పక్షపాతిగా ఆయన రాసిన పాటలు ఉద్యమానికి బలాన్నిచ్చాయి.** ప్రాణత్యాగానికి సైతం సిద్ధమయ్యేలా ప్రేరేపించాయి. ప్రజలకు నాయకత్వం దిశగా ఉత్సాహమందించాయి. తిరుగులేని ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయి. గెరిల్లా పోరాటాలకు సైతం ప్రజలను సిద్ధం చేశాయి ఆయన పాటలు.

నిజాం ప్రభుత్వ దమనకాండ కొనసాగుతున్న రోజులవి. రాజపేట మండలం రేణుకుంటలో కమ్యూనిస్టుల గ్రామ సభ జరుగుతోంది. సభలో 'మాభూమి' నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. గొల్ల సుద్దులు చెప్తున్నారు. ఆ సభలో సుద్దాల హనుమంతు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి మొదలైన ప్రముఖులు పాల్గొంటున్నారు. ఇంతలో ఒకవార్త. గ్రామ సభను భగ్నం చేసేందుకు నిజాం మూకలు వస్తున్నాయని ఆ వార్త సారాంశం. దీంతో సభికులందరూ తలో దిక్కు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఆ సందర్భంలో ఒక సభికురాలి చేతిలో ఉన్న కర్రను అందుకున్న సుద్దాల హనుమంతు 'వెయ్.. దెబ్బకు దెబ్బ..' అంటూ ప్రజలను ఉత్తేజితులను చేశారు. దాంతో సభికులందరూ నిజాం సైన్యాన్ని ఊరి పొలిమేర వరకు తరిమికొట్టారు. ఆ నినాదమే పాటగా మారి, తెలంగాణ సాయుధ పోరాటానికి ఆత్మస్థైర్యాన్ని కల్పించింది.

మరో సందర్భంలో నిజాం సైన్యం ఒక గుడిసె ముందు ఆగింది. ఆ గుడిసె నుండి పాపయ్య అనే వెట్టి కార్మికుడు బయటికొచ్చి 'దొరా! నాకు జ్వరం. నీ కాల్మొక్త బాంచెన్' అని బతిమాలుకున్నాడు. జవాను కాళ్లపై పడ్డాడు. కానీ పాపయ్యను కనికరం లేని ఆ జవాను నిర్దాక్షిణ్యంగా తన్నాడు. 'అరే బద్మాష్! ఆరాం జాదే. నఖ్రే కర్తా' అంటూ తన్నుకుంటూ వీధుల్లో ఈడ్చుకుంటూ వెళ్తున్నాడు. అక్కడే ఉన్న హనుమంతు 'వెట్టి చాకిరీ విధానమో రైతన్నా / ఎంతజెప్పిన తీరదు కూలన్నా' అంటూ వెట్టి చాకిరీ విధానాన్ని పాట రూపంలో పాడి పాపయ్యకు కొండంత అండగా నిలబడ్డారు.

**తానొక్కడే కళారంగంలో కృషి చేయడంతో ఆగిపోకుండా మరికొందరు కళాకారులను రూపొందించే పనిలో కృతకృత్యులయ్యారు సుద్దాల హనుమంతు.** వివిధ కళారూపాల్లో ఎందరికో శిక్షణ ఇచ్చారు. స్థానిక పరిస్థితులకను గుణంగా పాటలు కట్టి ప్రదర్శించేవారు హనుమంతు బృంద సభ్యులు. దాంతో ఆయా కళారూపాల ప్రదర్శనలు గ్రామీణులను విశేషంగా ఆకట్టుకునేవి. తన పాటలతో పాటు గంగుల శాయిరెడ్డి, దాశరథి తదితరుల గేయాలను సైతం పాడేవారు హనుమంతు. వివిధ ప్రదేశాల్లో సాంస్కృతిక ప్రదర్శనల ఏర్పాటుతో పాటు పలుమార్లు వివిధ ప్రదర్శనలకు కాప లాగా కూడా సాయుధ దళం సేవలను వినియోగించుకునేవారు. అదే సందర్భంలో సాయుధ శిక్షణ కూడా తీసుకున్నారు హనుమంతు.

కళారూపాల ప్రదర్శనలకే పరిమితం కాకుండా అన్యాయాలను ఎదుర్కోవడంలో స్వయంగా బరిలోకి దిగిన ఉద్యమకారుడు హనుమంతు. భూమి కొలతల్లో భూస్వాముల దగాను గుర్తించి, క్షేత్ర గణితాన్ని అభ్యసించారు. ఊళ్లలో భూమి కొలత పనులను తానే నిర్వహించేవారు. దాంతో భూస్వాముల అన్యాయాలు గ్రామీణులకు తెలిసేవి. అందువల్ల వారికి హనుమంతు దైవంగా కనబడేవారు.

హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య అనంతరం అనారోగ్య కారణాల వల్ల ముంబాయిలో కొద్దికాలం గడిపారు హనుమంతు. దేశంలో తొలి ఎన్నికలకు కొద్ది ముందు 1952లో తెలంగాణకు తిరిగివచ్చారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావి నారాయణరెడ్డి గెలుపు కోసం తన పాటల ద్వారా ప్రచారం చేశారు.

**హనుమంతు పాటలు ప్రాచుర్యం పొందడానికి వాటిలోని శబ్ద లయ ఒక కారణం. కవితావేశం, భావ గాంభీర్యత, ఆలోచనాధార, సామాజిక చైతన్యం ఆయన పాటల్లో ధ్వనిస్తుంటాయి.** ఆయన రాసిన 'పల్లెటూరి పిల్లగాడ', 'రణభేరి మోగింది', 'వెయ్ వెయ్ దెబ్బ', 'ప్రజా ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం', 'కన్నులో భగాభగా కడుపుల్లో ధడాధడా', 'భళిరె తెలంగాణ వహరె తెలంగాణ' మొదలైన పాటలు ప్రజల నాల్కలపై చిందులేశాయి. పల్లెటూరి పిల్లగాని జీవితంలోని దైన్యాన్ని 'పల్లెటూరి పిల్లగాడ' పాటలో చిత్రిక పట్టిన హనుమంతు 'ఎన్నికలొచ్చిన సందడి వింటే/ ఎత్తరుగులపై పెత్తందారులు / అన్ని విధంబుల ప్రజల దోచుకొని/ అందలమెక్కిన మహానుభావులు/.. / తంటాలెన్నో పడుతున్నారు/ జాగరతోయ్ జాగరత/ హెచ్చరికోయ్ హెచ్చరిక' అంటూ సమకాలీన రాజకీయాలపై సైతం పాటలు రాశారు. 'ప్రజా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం / ప్రజా ప్రభుత్వం సాధిస్తాం / నిజాములో ప్రతి బజారులో మా/ ధ్వజం ఎర్రనిది ఎగురవేస్తాం' అన్న ధీమాను కనబరిచారు.

కాన్సర్ వ్యాధితో బాధపడుతూ 1982 అక్టోబరు 10న మరణించారు హనుమంతు. ఆయన పేరుతో ఆయన కుమారుడు సుద్దాల అశోక్‌తేజ 2010లో 'సుద్దాల ఫౌండేషన్'ను స్థాపించారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సుద్దాల హనుమంతు –జానకమ్మ పురస్కారాన్ని ప్రతి ఏటా అందజేస్తున్నారు.

తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో సుద్దాల హనుమంతు పాత్ర ప్రధానమైంది. బుర్రకథలతో తెలంగాణ సమాజాన్ని ఉద్యమోన్ముఖం చేశారు. పాటను తూటాగా మార్చి దోపిడీ వ్యవస్థపై ఎక్కుపెట్టారు. తెలంగాణ కళారూపాలకు విశేష ప్రాచుర్యం కల్పించడంలో ఆయన కృషి శ్లాఘనీయం. జానపద కళారూపాలను ప్రజా చైతన్యానికి వినియోగించిన ప్రజా కళాకారుడాయన. తెలంగాణ సమాజ విముక్తి కోసం పల్లవించిన స్వేచ్ఛాగీతం సుద్దాల హనుమంతు.



మూడవ రోజు ఆదివారం ఆకుల శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, డా॥ ఓలేటి పార్వతీశం, కళా జనార్ధనమూర్తి, మహ్మద్ రఫీ, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు.



4వ రోజు సోమవారంతాడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షులు ఆయాచితం శ్రీధర్, కళా వీఎస్. జనార్ధనమూర్తి, కిన్నెర రఘురాం తదితరులు.

## అంతా ప్రశాంతం

గల్లీలు
చిన్న రోడ్లలో కలుస్తాయి.
చిన్న రోడ్లు
మెయిన్ రోడ్డుకు అతుక్కుంటాయి.
ఇండ్లల్లో టెన్షన్ గాలి
కుతకుత ఉడుకుతుంది.

లాఠీచార్జ్ జరిగింది
టియర్ గ్యాస్ పనిచెయ్యలేదు
బుల్లెట్లు వర్షించాయి
వార్తాపత్రికలు మృతుల స్కోరును ప్రకటించాయి.
అయినా పెద్ద పోలీసు
పరిస్థితి కంట్రోల్ లోనే వుందంటున్నాడు.

ఇరు పక్షాలూ
శాంతి యాత్ర నిర్వహించాయి.
కల్లోలిత ప్రాంతాలకు
సహాయాన్ని ప్రకటించి
ప్రభుత్వం ఉదారతను చాటుకుంది
అయినా పరిస్థితి ప్రశాంతమంటున్నారు.

కర్ఫ్యూను కాస్సేపు సడలించారు
రాళ్లవాన, కత్తిపోట్లు ఆగలేదు
అయినా కొన్ని ఏరియాలు
ప్రశాంతంగానే వున్నాయి.

కార్లున్న ఆసాములు
భద్రప్రాంతాలకు పరుగులు తీశారు
ఫుట్‌పాత్ మీది
చిల్లర వ్యాపారులూ బిచ్చగాళ్ళు
ఫైరింగ్ లో చచ్చిపోయారు
గల్లీలు పిడికిళ్లు బిగించి చూస్తున్నాయి
అయినా అంతా ప్రశాంతంగానే వుంది.

–డా॥ ఎన్. గోపి
సెల్:9391028496



## చేదు నిజం

అమ్మ మొదలు కాదె! అవని నెమరికైన
అమ్మపాలు మనకు కమ్మదనము
ఆమె మాట వినక ఆగమయ్యెదమేల?
చెప్పుచుంటి వినుము! చేదు నిజము!

మమ్మి డాడి యనుట మధురమై పోయెను
అమ్మ పలుకులోనె కమ్మదనము
కలదు, నిజము, నమ్ము; వలదు పరులభాష
చెప్పుచుంటి వినుడు! చేదు నిజము!

కన్నవారి నెపుడు కంటి పాపగ జూడు
దేశమాత కొరకు దేహ మొంచు
పుడమితల్లి నెపుడు పూజించి సాగర
చెప్పుచుంటి వినుడు! చేదు నిజము!

తెలుగులోన కలవు తీపి పదాలెన్నొ
ఉన్నవన్న కన్న చిన్ని నాన్న
తల్లి భాషలోనె తన్మయతను పొందు
చెప్పుచుంటి వినుడు! చేదు నిజము!

– ఇందిరాల రంగాచార్య
సెల్: 9553577706







ఈ నెల 11న త్యాగరాయ గానసభలో "భారతరత్న" శ్రీ వినోబా భావే జయంతి సందర్భంగా ప్రసంగిస్తున్న డా॥ ఏనుగు నర్సింహారెడ్డి. వేదికపై రేణుక, వై. రాజేంద్రప్రసాద్, కళా జనార్ధనమూర్తి, బైస దేవదాసు, శారద.



## పుల్లా మురళీఆకాశ్ మొదటి నవల

# ముగింపు లేని కథ




(గత సంచిక తరువాయి..)

మా స్కూలులో అంతగా చెట్లేమి లేవు. ఊర్లో కూడ. ఆ రోజు స్కూలుకు దుమ్మాకొట్టి కొండ ఎక్కాము నేను నా ఫ్రెండ్స్. కొండ పెద్దదే, గుడి బ్రహ్మాండంగా ఉంది. కానీ గుడి మూసెయ్యడంతో తిరిగి స్కూలుకు వచ్చాము.

అప్పటికే ఇంటికి వెళ్ళే సమయం అయింది. నేను నాన్న దగ్గర వున్న బండి తాళాలు తీసుకొని బండి తీసుకురావడానికి వెళ్ళాను. అప్పుడు ఆ బండి సీటు మీద కూర్చున్నానో లేదో చురుక్కుమంది. ఏమి చేయగలను అక్కడ నా స్నేహితులు ఉన్నారు. వారు చూశారంటే ఎగతాళి చేస్తారు.

అందుకే అలాగే కూర్చోని బండిని నాన్న దగ్గరకు తీసుకువెళ్ళాను. చెల్లి నిదానంగా వస్తుంది వాళ్ళ తరగతి గది నుండి.

“తొందరగా రా” అని అరిచాను.

“రేయ్ వస్తుందిలేరా ఎందుకు అంత గట్టిగా అరుస్తావు, అందరూ ఏమనుకుంటారు” అని అన్నాడు నాన్న.

ముగ్గురం బండి ఎక్కి ఇళ్ళు చేరుకున్నాం. రాత్రి బాగా వేడి చేసింది. ఎన్ని నీళ్ళు తాగినా, మజ్జిగ తాగినా లాభం లేకుంది. ఆ దెబ్బతో నిద్ర కూడా రాలేదు. దానితో పొద్దునకల్ల జ్వరం వచ్చేసింది. నేను లేవలేకున్నాను. ఒక పక్క ఫ్యాన్ తిరుగుతుంది. చెమట ఎక్కువ పోస్తుంది. అలానే కళ్ళు మూసుకున్నాయి.

నన్ను ఎవరో లేపినట్టు, ఎక్కడికో తీసుకెల్లుతు న్నట్టు అనిపించింది. నా ముందు నాకు వెయ్యి ఫ్యాన్‌లు ఉంచినట్టు అనిపించింది. చల్లగా గాలి వీస్తుంది.

అంతలో అమ్మ “రేయ్ కొబ్బరిబొండం తాగు” అని గట్టిగా గొంతు వినిపించడంతో నేను కళ్ళు తెరవగానే కొద్ది కొద్దిగా ఎండ నా కళ్ళలోకి పడడంతో తలపక్కకు వంచాను. అప్పుడే చూశాను నా కళ్ళ ఎదురుగానే చెట్టు బుడం కనిపించింది.



“అమ్మా” అని గట్టిగా అరిచాను.

“ఏమిరా” అని చేయి పట్టుకుంది అమ్మ.

“అమ్మా ! నన్ను ఎందుకని చెట్టుకింద ఉంచావు, నాకు చెట్లంటే ఇష్టం ఉండదని నీకు తెలుసుకదా ! మరి ఎందుకని చెట్లకింద ఉంచావు” అని అరిచాను.

---

అది నేను నాలుగో తరగతి చదివేటపుడు :

“నాన్న !! నా చిన్ని పావురం ఎక్కడుంది ? చెప్పునాన్న” అని నాన్న దగ్గర అడిగాను.

“ఇంట్లోనే ఉంటుంది, పైన ఎక్కడైనా ఉంటుంది పిలువురా” అని అన్నాడు.

“సరే నాన్న” అని ఇల్లంతా అరుస్తూ వెతికాను, ఎక్కడ కనబడలేదు. రోజంతా వెతుకుతూనే ఉన్నాను. కాని ఎక్కడ కనబడలేదు. తిండి కూడా తినలేదు. అమ్మ నాన్న కూడా వెతకడం మొదలెట్టారు. బయట ఉందేమోనని ఇంటి ముందు, ఊర్లో అంతా వెతికాం. కాని ఎక్కడ కనబడలేదు.

మూడు రోజులు అయింది, అన్నం వెళ్ళాలా వద్దా అన్నట్టు గొంతు లోపలికి వెళ్ళింది. నా కళ్ళు లోతుకెళ్ళాయి. “వెళ్ళి గింజలు తీసుకురా కొన్ని బయట పెడదాం. దానికి గింజలు అంటే చాలా ఇష్టం కదా!” వెళ్ళు అంది అమ్మ.

వంటింట్లోకి వెళ్ళాను అప్పుడు వచ్చింది ఏదో కంపు వాసన. వెంటనే అమ్మను పిలిచాను “అమ్మా! ఇక్కడికిరా ఎక్కడో ఎలుక చచ్చినట్టువుంది” అనగానే సంతోషంతో పరుగెత్తుకు వచ్చింది.

“హమ్మయ్య ! ఇన్ని రోజులకి చచ్చింది ఎలుక” అనుకుంటూ వచ్చింది. ఎలుక కోసం అంతటా వెతికాము, కానీ అక్కడ ఎలుక చచ్చింది లేదు, అక్కడ అసలు ఏమి లేదు.

“నన్నే ఆట పట్టిస్తావురా !” అంటూ నవ్వుతూ కొట్టడానికి వచ్చింది.

“అది కాదమ్మా ఎలుక కాకపోతే మరేమి చచ్చి ఉంటుంది. ఎక్కడి నుంచి వస్తుంది ఈ కంపు వాసన” అని అడిగాను.

“నిజమేరా” అంది అమ్మ.

“అమ్మా ! పద వెతుకుదాం” అన్నాను.

మొత్తం పైన, కింద, గూళ్లలో, దిబ్బలలో వెతికాం. కానీ ఎక్కడ కనిపించలేదు. ఆ కంపు వాసన మాత్రం ఆగకుండా వస్తుంది.

“నాకు తెలిసి ఇంటి వెనుక ముళ్ళపొదల చెట్లు ఉన్నాయి కదా ! అక్కడ వెదుకుదాం పదా !” అని నిదానంగా నడుచుకుంటు వెళ్ళాం. ఏది కనపడకూడనిదో అదే కనపడింది.

వెంటనే కళ్ళు తిరిగి పడిపోయాను. అమ్మ నాన్నను పిలవడం, నాన్న నా మీద నీళ్ళు చల్లడం అన్ని వెంట వెంటనే జరిగిపోయాయి.

నేను నిదానంగా లేచి “నాన్న చూశావా ? నా పావురానికి ఎలాంటి పరిస్థితి పట్టిందో నువ్వు పావురాన్ని బయట వదులు. అలా బంధించగూ డదు” అని చెప్పావు. నేను పావురాన్ని బయటకు వదిలాను.

**“నాన్నా అది ఎలా చనిపోయింది అనుకుంటున్నావు ! నాన్నా చెప్పు నాన్న” అని ఏడిచాను.**

“నాలుగు రోజుల కింద పావురాన్ని బయటకు వదిలాం కదరా, ఆ రోజు వర్షం పడింది కదా. ఆ రోజు వానలో తడిసి అది ఎగరలేక చెట్లమీద దిగలేక చెట్లలో పడి, దానికి ముల్లు అవి ఇవి గీసుకోవడంతో చనిపోయి వుంటుంది. పాపం ఎగరలేక అంత పై నుండి ముళ్లలో పడి చనిపోయింది. దాన్ని ఒక పిల్లి తినడానికి ఎత్తుకొచ్చి ఇక్కడ పడేసింది.

“నాన్నా ! ఇదంతా ఆ చెట్లవల్లనే నాన్న నా పావురం చనిపోయింది, అనుకుంటూ పక్కనే వున్న మొక్కల కుండీని కోపంతో కాలితో తన్ని పగలకొట్టేశాను. నాన్న, అమ్మ నన్ను ఏమి అనలేక ఉరుకుండిపోయారు. అప్పటి నుండి నాకు మొక్కలంటే కోపం. ఎంత కోపం అంటే పరీక్షలో మొక్క గురించి రాయమంటే రాయకుండా అలాగే వదిలేసి వచ్చేంత కోపం. ఎవడన్నా చెట్లు ఎక్కి కిందపడితే “రేయి నేను చెప్పానా చెట్లను నమ్మద్దు అవి నీకు కూడా హాని చేస్తాయి” అని చెప్పేవాడిని. నేను అప్పటి నుంచి ఫ్యాన్‌లకింద గడిపేవాన్ని ఇప్పటిదాకా.

“నీకు జ్వరం తగ్గిందిరా అంది” అమ్మ.

“నిజమా ! అని నా చెయ్యి నేను పట్టుకొని చూశాను. నిజమే”.

“చూశావా ! ఈ చెట్టు వల్లేరా నీకు జ్వరం తగ్గింది” చెట్టుకింద పడుకుంటే వెయ్యి ఫ్యాన్‌లు మన దగ్గర ఉన్నంత గాలి వస్తుంది, ఒక చెట్టు వెయ్యి గడపలకు ఆనందాన్ని ఇస్తుంది అనేవారు, చెట్లు లేకుంటే నువ్వు ఇన్నేళ్ళు బతికేవా, ఐనా నీ పావురం చచ్చిపోవడానికి కారణం నువ్వే కదా. పావురం పుట్టినప్పటి నుంచి పంజరంలో పెంచి, దాన్ని ఎగరడం కూడా రాకుండా చేశావు, మళ్ళీ మీ నాన్న మీదకు వెళతావు అంది” అమ్మ. అది నిజమేనని అనిపించింది.

ఆ కొబ్బరి నీళ్ళు తాగి “అమ్మా ఆ కుంపటి తీసుకురా ఇక్కడ చెట్టు నాటుదాం” అన్నాను. దానితో అమ్మకు సంతోషంతో వచ్చిన కన్నీరును చూశాను.

నాన్న దగ్గరకు వెళ్ళి “నాన్నా ! మన స్కూలులో చెట్లు లేవు కదా ! నాన్నా అందుకే నాకు ఇలా జరిగింది. పదా స్కూలులోకి వెళ్ళి చెట్లు నాటుదాం అన్నాను. నాన్న నా దగ్గరకు వచ్చి నా తలమీద చేయివేసి నిమిరాడు.

నేను చికెన్ షాప్ నుంచి బయటికి వచ్చి చెట్లు కోసం వెతికాను. అక్కడ చెట్టు జాడ కనబడలేదు. గోడలమీదేమో “చెట్లను పెంచండి లోకాన్ని కాపాడండి” అని ఉంది.

“సార్ మీ చికెన్” అని ఆ షాపువాడు నా చేతికి చికెన్ ఇచ్చాడు “ఇదిగోండి” అని డబ్బులు చేతికి ఇచ్చాను.

ఆ గోడలన్ని చూస్తు నడుస్తున్నాను. నేను ఏమి ఎక్కువకాలం బతికేది ఏముంది పట్‌మంటే పదేండ్లు కూడ ఉంటానో ఉండనో, అయినా నేను ఎప్పుడు నడుము వంచి గుంతలు తవ్వాలి. ఎప్పుడు చెట్లను నాటాలి. ఆ... ఐనా నాతో ఏమైవుతుంది వదిలేయి ఇంటికి లేటు అవుతుంది. మళ్ళా నా కోడలు నా మీద అరుస్తుంది. అలా ఇంటికి నడుస్తున్నా.

దహా.... దహా.... దహా.... ఏమిటి ఈ దగ్గు ఇలా వస్తుంది. దహా....దహా....దహా.... ముందు నుంచి ఒక్కసారిగా కారులోంచి పొగ వచ్చింది.

**అబ్బబ్బా ఈ పొల్యూషన్ తట్టుకోలేకపోతున్నాను. అభివృద్ధి అంటూ దేశాన్ని వివిధ రకాల రసాయనాలతో కాలుష్యం చేస్తున్నారు.** అభివృద్ధి నిజమే కానీ ఫ్యాక్టరీలతో అభివృద్ధి ఏనాటికీ జరుగదు. సర్వీస్‌లు పెరుగుతేనే అభివృద్ధి పెరుగుతుంది. ఫ్యాక్టరీలతో అభివృద్ధి పెరగదు. వున్నది కాస్త ఊడుతుంది.

ఇది ఎలా వుందంటే జుట్టు పెరుగుతుందని రకరకాల షాపుంలు వాడి వున్న మూడు వెంట్రుకలు వూడగొట్టుకున్నాడట, పక్కనే కాలుతున్న ప్లాస్టిక్, అబ్బా ఎంత ఘాటు వాసన, అది కాలి వేలుకి తగిలి అతుక్కుంది అబ్బా అన్నాను. అప్పుడే చిన్ననాటిది గుర్తుకు వచ్చింది.

---

గుర్... గుర్... గుర్... టప్... నేను నిద్రలోంచి కిందికి పడి లేచాను. రాత్రి ఒంటి గంట అయింది. నాకు నిద్రరావడం లేదు. వంట గది పక్కనే ఉండడంతో నీళ్లు తాగుదాము అని ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళాను. డోర్ తీసి నీళ్ల బాటిల్ తీసుకుని తాగి బాటిల్ పక్కన పెట్టి వచ్చి పడుకున్నాను.

చిన్నగా మాటలు వినపడ్డాయి. దొంగ ఇంట్లో పడ్డాడేమోనని చిన్నగా లేచాను. మళ్ళీ మాటలు వినపడ్డాయి. “నాకు ఈ జన్మ వద్దు, నన్ను అందరికి దూరం చేయనిస్తున్నావు దేవడా” అని.

చిన్నగా గోడ దగ్గర ఉన్న తలుపు దగ్గరకు వెళ్ళాను. “దేవుడా నన్ను చంపేయి దేవుడా” అని మళ్ళీ వినబడ్డాయి. ఇంతకి ఎవరబ్బా అని అలా కొంచెం తలుపు తీసి చూశాను. ఆశ్చర్యం ఇంతకి ఇది నిజమా ? అనుకున్నాను.

అక్కడ నేను తాగిన నీళ్ళ బాటిల్లు, దేవుడి ముందు నిలిచి “దేవుడా” నన్ను చంపేయి దేవుడా, నన్ను చంపేయి” అని అంటూంది.

“ఆ దేవుడేమి చెస్తాడు, నవ్వుతూ ఉంటాడు తప్పు” అని ఎవరో అన్నారు, ఎవరో అని అటువైపు చూశాను, అది రాగి చెంబు.

“నీకేమిరా నువ్వు ఎన్నైనా చెప్పుతావు నువ్వు అందరికి ఎప్పుడు ఉపయోగపడతావు” అంది బాటిల్.

“నువ్వు నాకంటే చాలా గొప్పవాడివిరా నిన్ను అందరూ ప్రతి ఒక్క విషయంలో వాడతారు” అంది రాగి చెంబు.

‘నువ్వు ఎవరికి రోగాలు రాకుండా మనుషులను ప్రేమతో కాపాడతావు, కానీ నేను అందరి ప్రాణాలను తీస్తున్నాను. జంతువులు, నీటి జీవులు, పక్షులను అందరినీ చంపేస్తున్నా” అని బాధపడింది బాటిల్.

“నువ్వు మొదట అందరికి సహాయం చేసేవాడివే, ఇప్పటికీ చేస్తున్నావు. కానీ నీలో ఉన్న రసాయనాల వల్లనే నువ్వు అలా అయ్యావు” అంది చెంబు.

“నువ్వు చూడు రాగి చెంబువి, నీ అవసరం అయిపోయాక నిన్ను తిరిగి కొలిమిలో వేసి నిన్ను మళ్ళీ ఒక కొత్త వస్తువుగా తయారు చేస్తారు. నేను చూడు నాకు కొత్త వస్తువుగా తయారు చేసేది వున్నా దాని వల్ల ఇంకా ఎక్కువగా నాశనం చేసేదానిలా అవుతాను. మాడి పోయిన దానిలా ఉంటాను. అప్పుడు నన్ను ఎవ్వరు ఇష్టపడరు” అంది బాటిల్.

భూమిపై ఉన్న ప్రతి ఒక్క జీవి, వస్తువు ఏదైనా ఎవ్వరికో ఒకరికి సహాయపడుతుంది, నాశనం అవుతుంది. అలాగే నువ్వు, నేను, అందరం ఎవరికో ఒకరికి సహాయపడాల్సి వుంటుంది, నాశనమవాల్సి ఉంటుంది.

“మాకంటే ఎక్కువగా మీరే ఉండి, ఎంతో మందికి సహాయ పడుతున్నారు కదా” అంది చెంబు.

**“అక్కడే కదా చిక్కు వచ్చింది, ఏమి కొన్నా మమ్మల్నే (ప్లాస్టిక్ కవర్లే) వాడేది. మాంసంకొనే టప్పుడు వాటిని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి ఇస్తారు. మాంసంలో కొవ్వు ఉండి అది అతుక్కుంటుంది. వాటిని శుభ్రం చేసినా పోకుండా ఉండి, అది శరీరంలోకి వెళ్ళుతుంది,** నేను వివిధ రంగులతో ఉన్నందుకు జంతువులు ఆహారం అనుకొని అవి తిని జీర్ణం కాక చస్తున్నాయి. ఇక ఏ పదార్థం కొనాలన్నా అది కవర్‌తో కప్పబడి ఉంటుంది” అంది బాటిల్.

“అయినా ఇదంతా నువ్వు చేసింది కాదు కదరా, ఇదంతా ఆ మనిషి చేసుకున్న పాపం. ఏమి చేస్తాం, అతని పాపాన అతనే పోతాడు” అంది చెంబు.

“అలా అనకూడదురా ! అతను ఏమి చేయగలడు, తను బ్రతకడం కోసం అలా చేశాడు. కానీ నాలోని లోపాలు చాలా లేటుగా తెలుసుకున్నాడు. ఆ లోపాల వల్ల ఈ భూమాత బాధపడుతుంది. అందుకే నేను అగ్గిలో దూకి చావాలని అనుకుంటున్నాను.

నేను ఏమి చేసినా చావలేను, కానీ ఇది ఒక్కటే మార్గం అంది.

“ఒద్దురా” అని రాగి చెంబు చెప్పింది వినకుండా గోడ ఎక్కి బయట చలి ఉందని, చలిమంట వేసుకున్న మంటలోకి దూకేసింది.

“వద్దు అని గట్టిగా నేనూ అరిచాను” వెంటనే అమ్మ వచ్చి “ఏమైందిరా” అని నిద్రలేపింది.

అమ్మా ప్లాస్టిక్ మాట్లాడుతుంది. రాగి చెంబు మాట్లాడుతుంది, అయ్యో “అది కల అయ్యుంటుంది లేరా, అందుకే నీకు చెప్పేది ఎక్కువగా టి.వి.లో బొమ్మలు చూడొద్దని” అని నాన్న అన్నాడు.

టప్‌మని కొట్టింది, “చూడండి పిల్లాడు ఎంతలా అరిచాడో, ఇంత పెద్దవారు అయ్యారు పది గంటల వరకు వారితో పాటు మీరు కూడా చూస్తారు, వాడిని చూడండి కలవరించుకొని ఎంతలా చెమటలు పట్టేశాయో”.

“నేనేమి చేశానే అంటూ ఆవలిస్తూ మళ్ళీ పడుకున్నాడు. వారిగోలవారిది, అప్పుడే పక్కన ఉన్న ప్లాస్టిక్ బాటిల్‌ని బయట ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాను.

ఎవరిదో బండి హారన్ కొట్టడంతో ఈ లోకంలోకి వచ్చాను. అప్పుడుకూడ నాకు ఒక ప్లాస్టిక్ బాటిల్ కనిపించింది. చేయి తీసుకోవడానికి పోతుంది.

**“అబ్బా ! నాకెందుకులే ఆ ఒక్క ప్లాస్టిక్ బాటిల్ తీస్తేనే ఈ దేశం బాగుపడుతుందా ఏమిటి ? ఇంకా కొన్ని సంవత్సరాలలో పోయేవాడిని నాకెందుకు ఇదంతా. నాదంతా అయిపోయింది, నేను ఏమి చేయగలను, ఏమి చేయలేను’** అనుకుంటూ ఇంటికి వెళ్ళుతున్నాను.



నా ముక్కు మీద ఒక నీటి చుక్క పడింది. ఎక్కడి నుండి పడింది. పక్కనే కొలాయి ఉంది. అక్కడి నుంచి పడి ఉంటుందిలే అనుకున్నాను. టప...టప...టప వర్షం పడింది. పరిగెత్తుకుంటూ హోటల్‌లోకి వెళ్ళాను.

ఏమిటిరా ఈ ప్రకృతి వైపరిత్యం, పొద్దునేమో అంతచలి, పది గంటలకల్ల చచ్చేంత వేడి, మళ్ళా ఇప్పుడేమో వర్షం, ఈ ప్రకృతి ఎప్పుడు ఎలా ఉంటుందో తెలీదు. అనుకోకుం డా భూకంపాలు, ఎప్పుడు నీరు మనుషుల్ని జలసమాధి చేస్తుందో తెలీదు. ఇదంత మనం చేసుకొన్న పాపం.

నా కోపాన్ని అణిచి వేయటానికే వచ్చినట్టు ఉంది ఈ అందమైన భామ అనిపించింది. మీరు ఈ వయసులో ఏంటి తాత అనుకునేరు. అది కాదు ఆ చల్లని గాలి మనసును శాంత పరుస్తుంది, ముక్కు ఆ నేల తల్లి వాసనను పీల్చింది. తాను పుణ్యాత్మురాలు అయ్యి మన పాపాలను స్వచ్ఛమైన నీటి శుద్ధితో పోగొట్టాను అనుకొంటోంది. పాపం పిచ్చిది, ఎంత శుద్ధినైనా మానవున్ని తాకితే అశుద్ధే అవుతుందని తెలియదు పాపం.

“అప్పుడే కనబడింది ప్రపంచంలో అన్నిటికన్న గొప్పది. ఎవరు వర్ణించలేని తల్లి ప్రేమ” కథ ఎంత బాగా రాశావురా కన్నా అంటూ తన కొడుకును ముద్దులాడింది. అమ్మా, నేను చిన్నపుడు రాసిన కథ అమ్మ మెచ్చి నాకు ఇచ్చిన ముద్దు ఇప్పటికీ మరిచిపోలేను.

–సశేషం..

## ముళ్ళల్లో దారి తీసుకొంటారు


–స్వ॥ రామ్‌ధారీ సింహ్ ‘దినకర్’

ఆపద కలిగినప్పుడు
పిరికివారే దహించుకుపోతారు
వీరులేమో చలించరు–
ఒక్క క్షణమైనా ధైర్యాన్ని వీడరు
కష్టాలను కౌగలించుకొంటారు
ముళ్ళల్లో దారి చూసుకొంటారు.

మానవుని మార్గాన్ని ఈ జగాన
అడ్డుకోగల ఆపదేముంది?
దృఢంగా ఢీకొని మానవుడు
పర్వతాలనే పెకలించివేస్తాడు
మానవుడు పట్టుపట్టితే
రాళ్ళనే కరిగించివేస్తాడు.


మానవుని లోపల
సద్గుణాలెన్నో నిండిఉన్నాయి–
గోరింటాకులో ఎరుపుదాగి ఉన్నట్లుగా
వత్తిలో వెలుగు దాగిఉన్నట్టుగా
వత్తిని వెలిగించనివాడు
వెలుగును పొందజాలడు.

కవి పరిచయం:
రామ్‌ధారీ సింహ్ ‘దిన్‌కర్’
స్వ. రామ్‌ధారీ సింహ్ ‘దిన్‌కర్’ 1908లో జన్మించారు. వీరి అభిమాన విషయం చరిత్ర. వీరు పార్లమెంటు సభ్యులుగా ఉండిరి. భాగల్‌పుల్ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సెలర్‌గా ఉండిరి.
వీరి రచనలు: కావ్యాలు: కురుక్షేత్ర, రశ్మిరథీ, ఊర్వశి, ము॥వి.
గద్యం: సంస్కృతికే చార్ అధ్యాయ్, మిట్టీకీ ఓర్ అర్ధనారీశ్వర్ ము॥వి.
వీరి ఊర్వశి కావ్యానికి జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. వీరు 1975లో పరమపదించారు.



–తెలుగు సేత:
**అమర్‌జీ**
సెల్: 9620186222

## నేటి నిజాలు



# డా॥ కూర్మాచలం శంకరస్వామి 'సుజ్ఞాన గీత' పుస్తకావిష్కరణ




పుస్తకావిష్కరణలో ఆచార్య వెల్దండ నిత్యానందరావు, బోయినపల్లి కిషన్‌రావు, డా॥ నాళేశ్వరం శంకరం, ఆవిష్కర్త బైస దేవదాసు, రచయిత డా॥ కూర్మాచలం శంకరస్వామి, కందుకూరి శ్రీరాములు, తిరుక్కోవళ్ళూరి రామానుజం, గుండు వెంకటేశ్వర్లు.





బోయినపల్లి కిషన్‌రావుకు గ్రంథాన్ని అంకితమిస్తున్న రచయిత డా॥కూర్మాచలం శంకరస్వామి.

సమాజ వికాసానికి రచనలు ఎంతగానో దోహదం చేస్తాయని బైస దేవదాసు అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి ముఖ్దూం నగర్‌లోని నాగార్జున హైస్కూల్‌లో ఆదివారం డా॥ కూర్మాచలం శంకరస్వామి రచించిన సామాజిక చైతన్య వ్యాసాలతో కూడిన సుజ్ఞాన గీత అనే పుస్తకాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన నేటినిజం సంపాదకులు బైస దేవదాసు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలు, గ్రంథాలు విజ్ఞానాన్ని పెంపొందింస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు సమకాలీన అంశాలపై వస్తున్న పుస్తకాలను చదవాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలన్నారు. సభకు జంట నగరాల తెరసం అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించగా రాష్ట్ర తెరసం అధ్యక్షులు డా॥నాళేశ్వరం శంకరం, ఆచార్య నిత్యానందరావు, పట్టు పరిశ్రమ శాఖ విశ్రాంత డైరెక్టర్ తిరుక్కోవళ్ళూరి రామానుజం, బెల్లంకొండ సంపత్‌కుమార్, పంకుశం వెంకటేశ్వర్లు, టీ. రాజేశ్, వల్లూరి వెంకటేశ్వర్లు, ట్రస్టు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, వాడేపల్లి కృష్ణ, డి. వెంకటేశ్వర్లు, నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ బోయినపల్లి కిషన్‌రావు, పలువురు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. రచయిత దంపతులను ఘనంగా సన్మానించారు. సుజ్ఞానగీత' పుస్తకాన్ని నాగార్జున స్కూల్ అధినేత కిషన్‌రావుకు అంకితమిచ్చారు.

## పుస్తక సమీక్షలు

## ఆలోచనాత్మకం-కొండ్రెడ్డి విమర్శా విశ్లేషణం




పెద్దలు అడిగోపుల వారి కవిత్వం అనగానే మనకు గుర్తొచ్చేది అందమైన దస్తూరి. దాదాపుగా అన్ని పత్రికల వారూ వీరి దస్తూరిని దూరం చేసుకోలేక వీరు పంపిన కవిత్వాన్ని యథాతథంగా ప్రచురించడం మనం చూస్తుంటాం. దస్తూరీ మాత్రమే కాదు అందున్న వస్తువు, శైలిలో కూడా నవ్యత్వం మనకు కనిపిస్తాయి. కవిలో నిరాడంబరత ఉంటేనే కవిత్వం అంబరాన్ని తాకుతుంది అనే మాట నిజమైతే ఆ మాట పెద్దలు అడిగోపుల గారికి కు వర్తిస్తుంది. ప్రముఖ కవి, ప్రఖ్యాత కవి అని పిలవడానికి కవిత్వం అక్కర్లేదు పదాల్లో భారం, వ్యక్తీకరణలో శబ్దం ఉంటే చాలు. అందుకే అలాంటి పెద్ద పదాలేవీ వీరికి నేను వాడదలచుకోలేదు. వీరిని కవిగానే ఉంచాలనే నా ఆశ, ఆశయం కూడా. ఎందుకంటే సమాజంలోని ప్రతి అంశం మీదా వివరించడానికి, ఎత్తి చూపడానికి వీరి కలం ముందు వరసలో ఉంటుంది. అలాంటి వీరి కవిత్వంపై విశ్లేషణ అంటూ కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి చేసిన ప్రయత్నం నిజంగా ఎంతో హర్షించదగినది. కవిత్వాన్ని కవిత్వం లాగానే చూసేవారే విమర్శకు అర్హులు. ఆ అర్హతను నూరు పాళ్ళూ సాధించిన కవి కొండ్రెడ్డిగారు అభినందనీయులు.

నిశ్శబ్దం ఎంతో అద్భుతమైన భావావేశం. అందుకు రూపం ఉండదు. ఎలాగంటే చుర్రున కాల్చే ఎండ కంటే చల్లని మంచుముక్క శరీరంపై ఉంటే మంట పుడుతుంది. అంటే చల్లదనంతోనే చురకలంటించడం అన్నమాట. ఆ చల్లదనం అడిగోపుల వారి మనోసంపద. శ్రామిక వర్గంలో జన్మించిన అడిగోపుల వారు శ్రామికుల పక్షం వహిస్తూ , శ్రామికులకు వ్యతిరేకంగా రాజ్యమేలుతున్న వ్యవస్థను ఎదిరిస్తూ కవిత్వం రాస్తున్నారు. 1945లో జన్మించిన వీరిలో దుర్మార్గాలకు కొమ్ముకాసే వ్యవస్థపైన ఆగ్రహం ఉంది. ఎలాగైనా మార్చాలనే ఆశ ఉంది. మార్చితీరాలనే తపన ఉంది. అందుకే దాదాపుగా 45 సంవత్సరాలనుండి కవిత్వ వ్యవసాయం చేస్తున్న వీరు ఇప్పటివరకు ఇరవై ఒక్క కావ్యాలు రచించారు. వీరి కవితా ప్రయాణం విప్లవ సాహిత్యంతో ప్రారంభించారు. నిరంకుశ పాలనతో దేశం అట్టుడికి పోతున్న తరుణంలో జన్మించిన కవులు వీరు. ఆధునిక కవిత్వ పరిణామాన్ని చెప్పే సమయంలో కూడా తనని విస్మరించడానికి వీలు లేనంత కృషి చేసిన వీరి జీవితం ధన్యం.


అంతటి ఉత్కృష్టమైన కవిత్వాన్ని, ఉన్నత విలువలు కలిగిన కవిని విశ్లేషించిన కవి కొండ్రెడ్డి గారు. వీరూ మంచి కవులు. విమర్శకులు. ప్రాచీనకాలంలో ఒక కవి కవిత్వం బావుంటే ఆ కవితో ఏ మాత్రం పరిచయం లేకున్నా ఆకాశానికి ఎత్తినవారు అనేకమంది ఉన్నారు. నేడు సాటి కవి కవిత్వం ఎంత గొప్పగా ఉన్నా సరే, అసలు ఆ వైపే చూడనట్టుగా పారిపోయేవారు కొందరు. ఇక్కడేదో కవులే కరువైనట్లు విదేశీ కవుల కవిత్వాన్ని, అక్కడ ఏమాత్రం కొత్తదనం లేకున్నా పదే పదే అదే కవిత్వమని ప్రచారం చేస్తున్న ఈ రోజుల్లో సాటి వారి కవిత్వంలోని మంచిని ప్రోత్సహిస్తూ మంచి కవిత్వాన్ని కీర్తిస్తున్న కవులు కొండ్రెడ్డి గారు. కవి ఎంపికలో ఏమాత్రం తొట్రుపడకుండా అద్భుతమైన వివరణలు అందిస్తున్న కవి వీరు. విశ్లేషణ అంటే బాగుందని నాలుగు మాటలు రచిస్తే సరిపోదు. అనేక విషయాలపై అవగాహన ఉండి తీరాలి. అందరి కవిత్వం తెలిసి ఉండాలి. అపుడే మనం విశ్లేషించే రచన స్థాయిని ఖచ్చితంగా అంచనావేయగలము. కొండ్రెడ్డి గారు కవిగా, రచయితగా, విమర్శకునిగా, వ్యాసకర్తగా కూడా ఎంతో అవగాహన ఉన్నవారు కనుక ఇంత చక్కని విశ్లేషకుని కవిత్వాన్ని, ఆడంబరాలు అక్కర్లేని కవిని ఎంచుకున్నారు. దాదాపుగా మనం ఎంచుకునే వ్యక్తిని లేదా కవిని బట్టి మనల్ని అంచనావేయగల లోకం ఇది. అవన్నీ సమపాళ్ళల్లో తెలిసిన కవి కొండ్రెడ్డి గారు కనుక సాహితీ లోకానికి ఏది అందివ్వాలో అదే అందించారు. అందుకే ఒకచోట అంటారు "అడిగోపుల అరిగిపోయిన కవి కాదు. ఆగిపోయిన కవి కాదు" అని.

కవి మొదట్లో ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించే కవిత్వం అనుకుని ఏవో కొన్ని వాక్యాలు రచిస్తాడు. ఆ ప్రయోజనం అంటే ఏమిటో అర్థమయ్యాక కవిత్వం రాయడం మొదలు పెడతాడు. కానీ అడిగోపుల వారు మొదటినుండి వారికి కావాల్సిన ప్రయోజనం ఏదో తెలుసుకునే రచించారని తెలిపారు. ఏ వాదమైతేనేమి? ఏ స్వభావమైతేనేమి? మనం రచించే దానిలో మనం అనుకున్నట్లు రచించగలిగామా అనేదే ఇక్కడ కావాల్సింది. తాము సమాజానికి ఏది చెప్పాలనుకున్నామో అది చెప్పగలిగామా ? అనేది మనకు కావాలి. అందుకే ఒకచోట కొండ్రెడ్డిగారు అంటారు అభ్యుదయం అంటే ఆస్తులకోసం, హక్కుల కోసం తన్నుకోవడం కాదు మానవీయత కోసం నడుం కట్టడం కూడా" అని, ఎంత గొప్ప మాట? అడిగోపుల వారు కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారు అని తెలిపారు. వీరి కవిత్వంలోని అంతర్గత భావాల్ని ఎంతో కూలంకుషంగా తెలియజేసారు. అందుకే అంటారు అడిగోపుల వారు ఒక నిశ్శబ్ద యుద్ధం అని. అందుకే కాబోలు అడిగోపుల గురించి ఆరుద్ర ఒక పద్యం ఇలా చెప్పారట. "పిడికిలి బిగించి ప్రజలు/ మ్మడిగా మన యీ వ్యవస్థ మార్చేదాకా/ పెడబొబ్బ సింహనాదం/ అడిగోపుల హోరు గాలి ఆగవు సుమ్మీ" అనే మాటలో ఎంత నిజం ఉంది? అని తెలియజేస్తారు. నిరంతరం సరికొత్త వస్తువుతో కవిత్వం రచించే కవి అడిగోపుల అంటారు. మరోచోట కన్న తల్లి ఒకటే అయినప్పుడు ఒక్కొక్కరి రాత ఎందుకు వేర్వేరు అవుతోందని ప్రశ్నిస్తారు అడిగోపుల. కొందరిలో పేదరికం, మరికొందరిలో ధనికత్వం ఎందుకుందో అంతు చిక్కలేదు అని నిరంతరం వాపోతారు. ఆకలి, ఆవేదన అందరిలో సమానంగా ఉండావే కదా మరి ఎందుకు కొందరిని అమితంగా బాధిస్తాయి? కొందరిని అలరిస్తాయి ? అనే ప్రశ్నల్ని సంధిస్తూ రచించిన అడిగోపుల కవిత్వాన్ని భిన్న కోణాల్లో పరిశీలించి, ఇంత చక్కని విశ్లేషణను అందించిన మంచి కవి మన కొండ్రెడ్డి గారికి అభినందనలు. అడిగోపుల కవితాలోతుల్ని మరిన్ని తెలుసుకుం దాం! కొని చదువుకుందాం.. ఏమంటారు?

ప్రతులకు: కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి
ఫోన్: 99487 74243
మరియు
హైదరాబాద్‌లో అన్ని పుస్తక కేంద్రాలు

-శైలజామిత్ర
9290900879

## మధురం "రుక్మిణీ కళ్యాణం"




సాహితీ ప్రక్రియల్లో మరో ప్రక్రియ మణిపూసలు. సృష్టికర్త వడిచర్ల సత్యం. నాలుగు పాదాలతో 1,2,4 పాదాలకు అంత్యానుప్రాస మరియు 10,11,12 మాత్రలలో ఏదైనా ఒక సంఖ్యనే ఉపయోగిస్తూ. అంటే 1,2,4 పాదాలలో మాత్రల సంఖ్య సమానంగా ఉండేలా చూడటం. 3 వ పాదానికి అంత్యాను ప్రాస ఉండరాదు. 10 నుండి 12 మాత్రలుండాలి. 3.4 పాదాలలో మెరుపులుండాలి. అనే నియమాలతో మమత 1 కాదు వంద కాదు ఏకంగా 1000 మణిపూసలు అందించారు. ఇదివరలో చారిత్రక నేపథ్యంలో రెండు గ్రంథాలు వెలువడ్డాయి. ఈ గ్రంథంలో 155 మణిపూసలు ఉన్నాయి. రాయడమే కాకుండా 'సహస్ర మణిపూసల కవిభూషణ" అనే బిరుదుకు కూడా ఎంపిక కాబడ్డారని తెలుస్తోంది. సంతోషం.

ఈ కవయిత్రి మమత తన పదవ తరగతిలోనే వివాహమైనా, చదువుపై ఆసక్తితో వివాహానంతరం ఎంఏ తెలుగు, టిపిటి, పిజిడిసిఎ చదవటం నిజంగా హర్షణీయం. డిగ్రీదాకా చదివి, వివాహానంతరం పై చదువులు చదవటం మామూలుగా జరిగే విషయం. కానీ పది తర్వాత ఇంత చదువు చదవటం అంటే చిన్న విషయం కాదు. అంతే కాకుండా పద్యంపై మక్కువ కలిగి పద్యాలు రచించడం మరింత విశేషం. వీటన్నిటి తో పాటు సృష్టికే సౌందర్యాన్ని, ఆనందాన్ని కలి గించే రుక్మిణి కళ్యాణం అనే అంశాన్ని ఎన్నుకో వడంతో ఎందరో విమర్శకుల ప్రశంసల్ని కూడా అందుకున్నారు. ఉదాహరణకు కొన్ని పద్యాలు..


**"అయ్యో! అల్ప భాగ్యమును/ తెచ్చుకున్నా యనుచును/**
**నా కళ్యాణమునకింక/ ఒక్క రాత్రియే మిగిలెను"**
**"చింత నొందుచు నుండెను / మదన పడుచుండె తాను**
**యల్ప భాగ్యురాలినా !/ యనుకొనుచు నుండె తాను"**
**"ఓ కృష్ణా నీ పేరును / లోకమందు నెవ్వరైనను**
**తలుచుకున్నంతలోనె /దేహతాపములు దీరును"**
**"తన రాకలో నుద్దేశ్యము/ దీవెనలో నాంతర్యము**
**తెలిసిన శ్రీ కృష్ణుడు/ అర్ఘ్య పాద సత్కారము"**

అంటూ ఎంతో హృద్యంగా రచించారు. చక్కని వస్తువు, భావం, సరళమైన భాష, సున్నితమైన అభివ్యక్తీకరణ వీరి పద్యాలలో ఉన్నాయి. రుక్మిణి, కృష్ణుల కళ్యాణంతో సంబంధమున్న ప్రతి సంఘటనను ఈ మణిపూసల్లో ఒదిగించారు. ప్రతి పద్యంలో భక్తి తత్వాన్ని చేర్చి ఓ కృష్ణా నిన్ను తలుచుకుంటే చాలు కదా? మా బాధలన్ని తొల గిపోవును కదా అని ఎన్ని సార్లు, ఎన్ని రూపాల్లో అన్నా మనసు పులకరించక మానదు. కవయిత్రికి అభినందనములు. రుక్మిణీ కళ్యాణానికి అభివా దములు.

ప్రతులకు : మమత ఐల,
ఫోన్: 9247593432

-శైలజామిత్ర
9290900879

## ప్రతిభావంతమైన "కావ్యమాల"






ప్రాచీనం నుంచి తెలుగు సాహిత్యం పద్యం నుండే ప్రారంభమైనది. పండితులకు మాత్రమే పరిమితం కావడం చేత ఈ పద్యం కొందరికే పరిమితమైపోయింది. వచన కవిత్వం అందరికీ అర్థం కావటంతో దానికి ప్రజాదరణ పెరిగిపోవడం జరిగింది. అలాగే పాట, అలాగే గేయం, లాంటి అనేక ప్రక్రియలు ఎన్ని వచ్చినా తెలుగు సాహిత్యానికి నిండు చేకూరుతుందే తప్ప ఎక్కడా లోటుగా కనిపించదు. కానీ ఈ శతకం రచించినది పదవ తరగతి విద్యార్థి అనగానే నిజంగా ఆశ్చర్యం వేసింది. తెలుగు మాట్లాడటమే పాపం అనుకుంటున్న తరం ఉంటున్న ఈ రోజుల్లో కావ్య అనే అమ్మాయి తనలోని భావాలను ఇంత చక్కగా రచించి మెప్పించడం చూస్తుంటే తెలుగు సాహిత్యానికి ముందు ముందు మంచి రోజులున్నాయని అనిపిస్తోంది. అయితే ఆ సంబంధిత ఉపాధ్యాయులు పిల్లలలోని ఆసక్తిని గమనించి ప్రోత్సహించేవారు ఉన్నారా అంటే అది ఆలోచించాల్సిందే. కానీ కావ్యకు తన ఉపాధ్యాయుడు గుండ్ల రాజు శతకంగా తీర్చిదిద్దారంటే వినడానికే ఆనందంగా ఉంది. ఇదివరకు తొగుట పాఠశాలలో "బాలల కవితా మకరందం" వెలువరించారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని విద్యార్థులను ఈ విధంగా తీర్చిదిద్దితే ఇక తెలుగు ఎక్కడికీ పోదు. మన వాకిట్లోనే. మన కళ్ళముందే ఉంటుంది అనడంలో అతిశయోక్తి లేదు.

పద్యాలలోకెల్లా సులభతరమైనది ఆటవెలది అంటారు. కనుక ముందుగా కావ్య 116 ఆటవెలది పద్యాలను రచించింది. కావ్య సిరులు పంచి కలిమి పెంచు" అనేది ఈ శతక మకుటం. ప్రతి పద్యంలో ఎక్కడా తీసిపోనట్లుగా భావాలు పెద్దలకు ఆలోచనలకు దీటుగా ఉన్నాయి.

"చదువు వలన మనకు చక్కని సిరులెన్నో/ చదువు మనకు తెలుపు జన్మ ఘనత/ చదువు వలన గలుగు సౌభాగ్య సంపద/ కావ్యసిరులు పంచి కలిమి పెంచు"

"వసుధ నున్న చెట్లు వరములై జనులకు/ పచ్చదనము నెంతో పంచు చుండె/ ప్రాణమున్న మనకు ప్రాణవాయువు చెట్లు"

"గురువు మాట నెపుడు గురుతుగా నుంచుకో/ మంచి నెతో పంచి మించి వెడలు/ తల్లి, తండ్రి, గురువు దైవాలు మనకురా/


"ఆంగ్ల విద్య మాకు యానందముగ నేర్పు/ పల్లెశ్రీను సారు ప్రతిభ తోడ/ వెలుగు నిచ్చు మీకు వేవేల దండాలు" లాంటి పద్యాలు గమనిస్తే ఎవ్వరికైనా కావ్యలో ఎంత ప్రతిభ వుందో కదా అనిపిస్తుంది. ఈ చిన్నారి భావాలు చదువుతుంటే పెద్దలైన అనేకమందికి సమానంగా అనిపిస్తుంది. కావ్య తన పేరుకు తగినట్లుగా అనేక పద్యాలను, కావ్యాలను రచించి తెలుగు సాహిత్యంలో నిలిచిపోవాలని ఆశీర్వదిస్తున్నాను. ప్రోత్సహించే గుండ్ల రాజు లాంటి గురువులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.


ప్రతులకు : గుండ్ల రాజు,
ఫోన్: 9885257050



-శైలజామిత్ర
9290900879

## పరిమళిస్తున్న "మట్టివాసన"



కవిత్వం పరిమళిస్తే ఆ వాసన మట్టినే తలపిస్తుంది. అందుకేనేమో "మల్లెల వాసన కన్నా/ గులాబీల పరిమళాల కన్నా/ అత్తరు సెంటు వాసనలకన్నా/ నా మట్టి వాసనలు మిన్న" అంటారు మేరెడ్డి యాదగిరి రెడ్డి.. "మనిషి మనుగడ మట్టి వాసన/ జీవకోటికి ఆయువు మట్టి వాసన/ మన తండ్రుల తండ్రులు/ తాతల తాతలు/ ముత్తాతల ముత్తాతలు /భూమిని నమ్ముకున్నారు కానీ / అమ్ముకోలేదు" అనడం చూస్తుంటే ఈ కవిలో ఉన్న ఔదార్యం కనిపిస్తుంది.

అక్కడక్కడా మంచి కవిత్వం కనిపిస్తోంది అనడానికి ఉదాహరణ ఈ కవితా సంపుటి. మేరెడ్డి మంచి కవిత్వం అందించాలని ప్రయత్నించారు. సమకాలీన సమస్యలనే అందరూ ఇతివృత్తాలుగా తీసుకుంటారు. రైతు బాధలు, ఆకలి బాధ, అన్యాయం, అమానుషం లాంటివన్నీ కవులందర్నీ దాదాపుగా కవిత్వం రాయడానికి ప్రేరేపిస్తూనే ఉంటాయి. కానీ ఆ సమస్యను ఎలా తెలియజేసాము అనేది చాలా అవసరం. అక్కడే కవి తన కలం పదును కనిపిస్తాయి. ఉదాహరణకు వీరు రచించిన చిన్న కవిత "దాత" ను గమనించండి

"జన్మనిచ్చిన/ తల్లితండ్రికి/ అన్నం పెట్టని పెద్దమనిషి/ తిరుపతి దేవాలయంలో/ నిత్యాన్నదాన కార్యక్రమ మహాదాత" అంతే.. ఇందులో ఎంత ఆవేదన ఉంది? ఎంత నిజం ఉంది? ఎంత ఆవేశం ఉంది? కన్న తల్లితండ్రులను హోమ్‌లలో చేర్చి మరోవైపు తిరపతి హుండీలో ధనం, నగలు వేస్తుంటే పాపం పోతుందా? అనేది ఎందరో తెలుసుకోవాల్సిన విషయం. అలాగే "దేశం వెలిగిపోతోంది" అనే కవితలో "ప్రపంచీకరణ పట్టణీకరణ / అమ్మతనం పల్లెతనం డొల్లబోయింది/ మంచితనం మనిషితనం మటుమాయం/ కులవృత్తుల మింగిన ప్రపంచీకరణ భూతం/ డాలర్ వుచ్చులో దేశపు యువత" అయినా దేశం వెలిగిపోతోంది" అంటూ సమస్యలు అనేకం ఉంటూనే ఉన్నా సరే ఇంకా దేశం వెలిగిపోతోంది అంటూనే ఉంటున్న నేటి తరాన్ని ఎత్తి చూపుతూ రచించిన ఈ కవిత ఎంతో ఆలోచనాత్మకంగా ఉంది. "ఆకలి, దారిద్ర్యం, విలయతాండవం, మర్డర్లు, మానభంగాలు మాఫియాలతో దేశం వెలిగిపోతోంది" ఇలా సాగుతుందీ కవిత. అధర్మాన్ని, అసత్యాల్ని, అన్యాయాల్ని ఏమాత్రం సహించలేని వాడు ఒక్క కవి మాత్రమే. ఎదుటి వారి ఆవేదన తన వేదనగా భావిస్తూ నిరంతరం తాను చేసే పోరాటం అంతా ఎదుటివారికోసమే అనుకునే లక్షణాలున్న కవికి ఆవేదన కాక మరేం మిగిలింది?

కాకుంటే మనిషిని బతికించే పంటను పండించే రైతును కూలీగా మార్చి కూలీని రోడ్డు పక్కన అడుక్కునే బిచ్చగాడిలా చేసిన కార్పొరేట్ వ్యవస్థను తీవ్రంగా దుయ్యబెట్టారు ఈ కవి. సమాజ పోకడలు ఎప్పటికప్పుడు అర్థమవుతూనే ఉన్నా సరే ఎప్పటికప్పుడు కొత్త గాయాల్లా తగులుతున్న ఈ మోసాలను సహించాలంటే కవి, రైతు ఎవరైనా గుండె దిటవు చేసుకోవాల్సిందేనా? ఏమో!

ప్రతులకు :మేరెడ్డి యాదగిరి రెడ్డి, ఫోన్: 9949415796

-శైలజామిత్ర

## ఓసీ డెంగ్యూదోమా-నశింపుమా!

శా॥ ఎట్లోదూరిగృహంబులో,జనులపైకివెక్కి నీకొండితో
గాట్లన్ వేయుచు మృత్యుదూతవలె రక్తంబున్ ప్రవేశించుచున్
"ప్లేట్లెట్ కౌంట్లు" కృశింప జేసెడి మహాభీతావహంబైన నీ
గుట్లున్ మట్లనెరింగి ద్రుంచవలె "డెంగ్యూదోమ" నీయున్కినే!

మ॥"తెరలున్", "కాయిలు","మ్యాట్లు","బ్యాట్లు"ననుచున్ తీవ్రప్రయత్నంబులన్
నరులెన్నెన్ని ప్రయాసలందినను నీ నైపుణ్యమున్ జూపుచున్
మురుగున్ చెత్తల కోటలో వెలసి ముప్పున్ గూర్చ దండెత్తు నీ
దురితంబింక సహింజాలముగదే దోమా! యికన్ చావుమా!

శా॥తండాలందు వసించు పేద ప్రజపై దాష్టీకమున్ జూపుచున్
తుండమ్మెత్తుచు కుట్టి రోగమిడు నీదుశ్చేష్ట లింతింతలై
గండంబుల్ కలిగింప పిల్లలకు, నీగర్వంబు నీర్గారగా
చెండాడన్ వలె గాదెనిన్ మశకమా చేబూని సంకల్పమున్!

ఉ॥లొంగవునెట్టి మందులకు,లొంగవునెట్టిప్రయత్నమూనినన్
దొంగగ దూరి ఇండ్లకడ దోపిడి చేసెదు స్వాస్థ్యమంత,నీ
సంగతి తేల్చగావలెను,శాశ్వతమైన సమాధి గట్టగా
మంగళమౌను పృథ్విపయి, మానవజాతికి వీడురోగముల్!

మ॥దయలేకుండ మలేరియాజ్వరమునందన్ జేసి నీగాట్లతో
జుయిజుయ్యంచును వృద్ధియౌచు,పెను సంక్షోభమ్ము గామారుచున్
భయమున్ గూర్చెడి నిట్టి డెంగ్యు జ్వరమున్ వ్యాపింపగాజేయు నీ
చెయిదమ్మెల్ల నశింప జేసెదము ఛీఛీ!దోమ!వైదొల్గవే!

ఉ॥దోమయె రోగవాహకము,దోస్తులు దానికి చెత్తకుప్పలే!
దోమలువృద్ధిచెందగ యథోచిత రీతి సహాయకారులై
సోమరులైన మానవులె చూపిరి దానికి దారి,నింకపై
నేమమతోడ శుభ్రతను నేర్చిననే నశియించు దోమలున్!



-ఎస్ సాయిప్రసాద్
9440470774

# ఘనంగా జరిగిన బండికల్లు వెంకటేశ్వర్లు ట్రస్టువారి పురస్కారాల ప్రదానం

అక్షరం జీవితాన్ని ఆనందమయం చేస్తుందని నేటినిజం సంపాదకులు బైస దేవదాసు అన్నారు. శ్రీ బండికల్లు వెంకటేశ్వర్లు మెమోరియల్ ట్రస్టు, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళా లలిత కళావేదికలో ప్రముఖ కథా రచయిత విహారికి 'జీవన సాఫల్య పురస్కారం'. 3వ జాతీయస్థాయి వచన కవితల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం, పలువురు సాహితీవేత్తలకు స్ఫూర్తి పురస్కారాలు ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ మంచి సాహిత్యం మనసులను కదిలించి మంచి వ్యక్తిగా ఎదగడానికి దోహదపడుతుందని సమాజంలో గుర్తింపు పొందుతూ బాధ్యతలు తెలియపరుస్తుందని బైస దేవదాసు అన్నారు. తండ్రి పేరున ట్రస్టును ఏర్పాటు చేసి కవితల పోటీలు నిర్వహించి సాహిత్య సేవ చేస్తున్న బండికల్లు జయదగ్ని, బండికల్లు శ్యాంప్రసాద్‌లను అభినందించారు.

సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో కళా జనార్ధనమూర్తి, జివి.ఆర్. ఆరాధర కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి, పెద్దూరి వెంకటదాసు, మౌనశ్రీ మల్లిక్, పరబా పరమేశ్వరరావు పాల్గొన్నారు. బండికల్లు వెంకటేశ్వర్లు మెమోరియల్ ట్రస్టు మొదటిసారి ప్రముఖ కథా రచయిత శ్రీ విహారి గారికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు.

మూడవ జాతీయ స్థాయి వచన కవితల పోటీల్లో విజేతలైన నల్లా రమేశ్ (ప్రథమ), శ్రీమతి కళా గోపాల్ (ద్వితీయ), సింగరాజు శ్రీనివాస్‌రావు (తృతీయ)లకు బహుమతులు, ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను చొక్కాపు లక్ష్మునాయుడు, ఉప్పలపు శేషునాథ్, మాడిశెట్టి శ్రీనివాస్, పి.వి. రమణకుమార్, డా॥ జడ సుబ్బారావులకు అతిథులు అందజేశారు. డా॥ బురగడ్డ శ్రీనాథ్, డా॥ కన్నోజి సత్యనారాయణ, శ్రీ మంచనమోల సుబ్బారావు, దొరరాజు, శ్రీమతి దేగల అనితాసూరి,కోరప్రోలు మాధవరావు, ఎన్.రఘువీర్ ప్రతాప్, జల్ది విద్యాధర్‌లకు స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. ముందుగ సాహితీ ప్రకాశ్ నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో తంగిరాల చక్రవర్తి, డా॥ పూసల రజనీగంగాధర్, బాలగంగాధరయ్య, పి. రవికుమార్, అనంతోజు మోహనకృష్ణ, గూడూరు విజయలక్ష్మి, మల్లాది విజయలక్ష్మి, ఎం. రఘుపతి, కె. విల్సన్‌రావులు స్వీయ కవితా గానం చేశారు. మొదట ట్రస్టు నిర్వాహకులైన బండికల్లు జమదగ్ని, సంస్థ ఆశయాలను భవిష్యత్తు కార్యక్రమాలను వివరించారు. చివర బండికల్లు శ్యాంప్రసాద్ వందన సమర్పణ చేశారు. పద్మశ్రీ లత ప్రార్థనగీతంతో సభ ప్రారంభమైంది. బండికల్లు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.







పురస్కార గ్రహీతలతో అతిథులు ● సభలో ప్రసంగిస్తున్న బైస దేవదాసు ● విహారికి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న బండికల్లు జమదగ్ని, పెద్దూరి వెంకటదాసు, బైస దేవదాసు, బండికల్లు శ్యాంప్రసాద్, కళా జనార్ధనమూర్తి, గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు.

## నిజదేవోభవ...

(జనం కోసం, సమాజవనంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదేవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

### కూలితల్లికి ప్రణతులు

తే॥ చిన్నతనమున పెళ్ళైన చిన్నతల్లి !
'మోయుటున్నది జీవనమే'యటన్న
పలుకు నీయనుభవమున పల్లవించె
నందమును మించె నీ శ్రమ! సుందరమ్ము!

ఉ॥ పెండ్లివయస్సుకంటె మునుపే కళపెంచెడి తీరు, పేదవా
రింట్ల విషాద జీవన పరిస్థితి కద్దము నీవెనమ్మ! నా
రేండ్ల ప్రయోజనమ్ము సమయించెను, మించెను లేమి; ఏమిటీ
ముండ్ల మయమ్ము మార్గము! సమూలముగా నశియించుటెన్నడో!?

ఆ॥ కడుపులోని బిడ్డ కదులుచు నుండగా
గంప నెత్తినెట్టి కదలకుండ
వంత లాపుకొనుచు పైపైన నవ్వుచు
పనులు సేయు నీకు ప్రణతులమ్మ!

మ॥ గతిలేకున్నను గాని, పొద్దు మునుగంగానె వ్రతంబున్ వలెన్
పతిదేవుండిల మద్యపానమును కంపారంగ గావించి, నీ
హితమున్ విస్మరియించి స్వార్థ సుఖమున్ స్వేచ్ఛాంతరంగంబునన్
గతుకన్ జూచుట నెట్టులోర్చెదవో కూనా! జాలి పాటెత్తెడిన్.

కం॥ పొద్దెక్కక మునుపే నీ
నిద్దుర విడనాడి యొక మునీంద్రుని వోలెన్
పద్దెనిమిదిగని సేవల ము
ప్పొద్దులు గడిపేవు నీవు పుణ్యపు రాశీ!

చ॥ తరిన విరామమే గనక; దార్ఢ్యత, యోపిక లేకయున్న; నీ
సగము శరీరమైనయును, సంతమ తనను భర్త కర్తగా
జగమును జూచుచున్ విధిగ సాగెదవమ్మ! మనుష్యజాతిలో
నె గద సమానతా తరువు నేలను గూలను సర్వవేళలన్.

ఆ॥ మన ప్రభుత్వమిచ్చు మాన్యమౌ సాయము
నిన్ను సరిగ చేరుకున్న గాని,
అందుకొనగ నీకు అడ్డంకు లెన్నెన్ని
వాటి నధిగమించవలెను తల్లి!

శా॥ నిన్నున్ నిత్యము పూవువోలెను నిదానించి శ్రమంబొందకన్
ఎన్నొ లీతుల నాదరించదగు ప్రాణేశుండు నీకోర్కెలన్
మన్నింపన్ దగనొల్లకన్ నిరత దుర్మార్గంబు నం దూగుచున్
కన్నెత్తైనను చూడకున్న నతనిన్ గాచేవు; ఆశ్చర్యమే!

ఆ॥ నీకులేని సుఖము నీదు బిడ్డలకైన
దక్కవలె నటంచు దలచుకొనుచు
పవలు రేయి కష్టపడుచుందు వోతల్లి!
త్యాగమయివి! పుత్రరాగమయివి!

శా॥ నీ కష్టంబుల జూడనొల్లరు సరే; నీ లేమి జూడంగనై
నన్ కాంక్షింపరు; నీకు సాయముగనైనన్ యుండగా నోపరీ
రికాసుల్ సరి మానవాళి చమటన్, రక్తమ్మ్యయున్ ద్రావుచున్
పైకమ్మీయగ చేరమాడెదరు దుర్భావాత్మ కాంట్రాక్టరుల్.

ఆ॥ నాటివారికన్న సంపద మిన్నయై
మానవతను మింగె మనకుండ
పేదవాని బతుకు పెనుచీకటిగ మారె;
మారె దినదినమ్ము మనుజ జాతి.

ఉ॥ కష్టపనుల్ ప్రమాదములు గానక సేయుదువమ్మ, వోపికన్;
మేస్త్రిరి కన్న నీదు శ్రమ మిక్కిలి యెక్కువ, యైన గాని, ఏ
మిస్తరు తల్లి కూలి? అది యెట్టుల నీ పనికిన్ సమంబు? చూ
పిస్తరు లేని పొంతన లవేవియు నిల్వవు హేతుబద్ధతన్.

తే॥ స్త్రీల కుద్యోగములయందు చెల్లు సమత!
పదవులను గౌరవమ్ము సంప్రాప్తమగును;
ఏలకో, శ్రమ జీవన జాలమందు
ఈ విభేదాలు? తొలగుటయే శుభమ్ము!

మ॥ ప్రణతుల్ నీకు! భవత్ శ్రమమ్మునకు; సంప్రాప్తించు నీ సేవకున్;
ప్రణతుల్ నీ సహనమ్మునకున్; నెనరుకున్; ప్రావీణ్యతా సౌరుకున్;
ప్రణతుల్ మౌనముకున్; సదాప్రణతి నిస్స్వార్థ ప్రియత్వమ్మునకున్;
ప్రణతుల్ జేసెద వంద వత్సరములున్ వర్ధిల్లుమా! సోదరీ!



-దోరవేటి
సెల్:9866251679

## తప్పెవరిది


ప్రకృతి అందాల నడుమ
పరవశాన నాట్యమాడుతూ
పిన్న పెద్దలు కేరింతలు కొడుతూ
సెలవు రోజున సేదతీరుతూ
గోదారిపై పయనిస్తుంటే
విధి వంచించిది మృత్యువు కాటేసింది
ఎవరు చేసిన తప్పిదమిది
పర్యాటకులు చేసిన పాపమేమి..!
నిండుకుండలాంటి గోదాట్లో తిరిగి
పాపికొండలతో ముచ్చటిస్తూ
ఉరుకు పరుగుల జీవితాన
ఆత్మీయులతో కలిసి సాగుతున్న నావ
నీటిలో మునిగి మరణశాసనం రచించడం
ఇదెక్కడి న్యాయం సబబేనా.......!
యంత్రం లోపమా, రక్షణ కవచాలు లేకనా
పడవ అలలకు బోల్తాపడేనా.. అంటూ
సమస్యల సాకు చూపడమేలా...!
పర్యాటకులను క్షేమంగా దరిచేర్చడమే ధర్మం
విషాద ఛాయలెప్పుడున్నా
రక్షించే మార్గము వుండాలపుడే
కన్నీటి పర్యంతం పాపికొండల ఘటన
ఇకనైనా జాగ్రత్త సుమా!
పర్యాటక మిత్రమా!



-ఉంద్రాల రాజేశం
9966946084

## శూన్యపుచూపు

తప్పెవరిదైతేనేం నిండుప్రాణాలు నీళ్ళలో కలిసిపోయాయి
సెల్ఫీలు కుల్ఫీలు అన్నీ ముగిశాక
ఆటపాటల అలరింపుకు సెలవిచ్చి
తదేకంగా నీటిని చూస్తున్నారో
రేపటి జీవితానికి కొత్త ముగింపు ఇద్దామనుకున్నారో
తేరుకునేలోపు బతుకు తల్లడిల్లింది
నీటియాతనలో కన్నీటిని వదిలి వెళ్ళిపోయారు
స్వప్నాలు రాలిపోయాయి
ఏమీ తెలియనట్టు గోదారమ్మ సాగిపోతోంది
ఇక్కడంతా అశాశ్వతమంటూ...
మంచుముక్కల్లా కరిగిపోతాయి జీవితాలు
ఎవరికెవరు ఈలోకంలో ఎవరికి తెలుసు అన్న కవివాక్యంలా
భారతీయులం కదా కష్టాలున్నా నష్టాలున్నా
నవ్వు చాటున దాచేస్తాము
లేదా బతుకునే బలిచేస్తాము
జీవితము ఒక్కటే కదా
మధ్యలోనే ముగిసిపోతే
ఎవరికి చెప్పుకోవాలి
ఏదేవుడికి మొరపెట్టుకోవాలి
శూన్యం నిండిన బతుకులను
ఏ దేవత లాలిస్తుంది
ఏ దేవుడు నడిపిస్తాడు...
(పాపికొండలు పడవ ప్రయాణంలో
అమరులైన వారి నివాళిలో)



-సి.యస్.రాంబాబు
9490401005

## నల్లమల కష్టాలు

మొక్కలు నాటండి
పచ్చదనం పెంచండి
జంతువులను రక్షించండి
నేలను కాపాడండి
అంటూ రక్షకుల్లా
ఉన్యాసాలివ్వడమే చాలదండి
నిజం భిన్నమండి
నల్లమల అడవి ఉండదండి
యురేనియమ్ త్రవ్వితే
అడవి కనుమరుగౌతుందండి
చెంచులు నిరాశ్రయులౌతారండి
అడవి వారికి తల్లిలా
బువ్వ పెడుతుందండి
యురేనియం అణు ధార్మిక కిరణ
ప్రసారం
వారికిశత్రువులా అపకారంచేస్తుందండి
నీళ్ళు విషం కలిపినట్టు కలుషితమౌతాయండి
నేల,గాలి కూడ కలుషితమండి
అడవి మాయమైతే జంతువులు బ్రతకవండి
గుహలు,జలపాతాలు నేలమట్టమౌతాయండి
పునరాలోచించండి
పర్యావరణాన్ని గొడుగు పట్టి రక్షించండి
నల్లమల గుండెలను త్రవ్వకండి



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## జై నల్లమల

నల్లమలను కాపాడుకుందాం
అడవిలో సింహంలా.. పులిలా
గాండ్రిస్తు.. గర్జిస్తాం..

పచ్చని అడవిలో విషం
చిమ్ముతున్నరు నిప్పులు ఊదుతున్నరు
మనలో కూటి దొంగలు మోపైంద్రు
కోట్లకు కోట్లకు పరుగెత్తటానికి
ప్రజల గోడు పట్టించుకోరు
ప్రజల క్షేమం జూడరు.

యూరేనియం వీడికెందుకు
యుద్ధం వీడికెందుకు...
ఆయుధాలు విరజిమ్ముతరు
ఫ్లుటోనియం విరజిమ్ముతరు
ప్రజలందరిని చావగొట్టుతరు
నేలను నిస్సారం జేస్తరు..

"పక్షుల రాగాల పాటులుండవు"
జంతువుల ధరహాసాలుండవు

పచ్చని చెట్లు బూడిదవుతాయి
గుట్టలుండవు గుడిసెలుండవు
నాగరికతలన్ని విధ్వంసమే
మరో హిరోషిమా,
నాగసాకి అవుతుంది.

"మన రాజకీయ అనకొండల"
అంతుజూద్దాం ప్రకృతిని
ధ్వంసం జేసిన వారిని ఉరితీద్దాం
బయపడేది లేదు బేదిరేదిలేదు
నల్లమలను కాపాడుకుందాం
జై నల్లమల జై పచ్చని అడవి.



– మియాపురం శ్రీనివాస్ పూడూరు



## పాపి కొండలూ - పడవ ఏమైంది ??!!

పాపి కొండల్లో ఏముంది ఇప్పుడు చూడటానికి
పడవ మునక దృశ్య తప్ప --
గోదారి వరద కంటె ఆప్తుల దుఃఖ ధృతే ఎక్కువ
గోదావరిలో పడవ దారి సుడిగుండ గండమైంది
"నౌకా విహారం" ఆనందాన్ని ముంచి
కావలిసిన వారికి కాకూడని దుఃఖాన్ని పంచింది !
నీరుగా సుందరంగా కనిపించినా లోలోపల
వరద కాలపు ప్రళయ దృశ్యం పోటు గోదారికి !
పాపం ! దుఃఖ ఘటనకు ముందు ఏ పాపమెరుగని
పాపికొండల పేరే మాటి మాటికి పతాక శీర్షికగా !!
బతికి బయట పడ్డ వారు పడవ మునుగుతున్న
దృశ్యాన్ని విషాదంగా వర్ణించడానికే అన్నట్లు -
వారిని ఎవరు ఒదార్చగలరు ??
పదిలం పదిలం అని
పాపికొండలు అరిచే ఉంటాయి ప్రతిధ్వనిగా --
కాని పడవ ఆగిందా -- ఆగమైంది !!
కుడి కుడిగా నీటిలో అడుగు వేసేముందు
ఎడమ ఎడమగా సముద్రమంత ఆలోచించాలి
పాపికొండలూ ! పడవ ఏమైంది !
అని అడిగితే ఏం చెపుతాయి ---
మనలాగే దుఃఖంతో రాయిరాయిగా జడమైనాయి
ప్రతిసారి ప్రమాదాలకు
పాపికొండలే ప్రథమంగా ప్రాథమిక సాక్షులు !!
ఎప్పటికీ పడవ ప్రయాణం
పరమపద సోపానం కారాదు



– కందాళై రాఘవాచార్య
9908612007

## మేధో సృజన వికాసానికి 'గణితం'




మేధో సృజన వికాసానికి గణితం ఉపయోగపడుతుందని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. వేదిక్ మ్యాథ్స్‌ఫోరం-తెలంగాణ ఆధ్వర్యంలో వేదిక్ మ్యాథ్స్‌పై మూడురోజుల శిక్షణా శిబిరాన్ని శుక్రవారం గానసభలో రామయ్య ప్రారంభించారు. తరగతి గదిలో విద్యార్థుల నుంచే తాను ఎంతో నేర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐఐటీలో ప్రవేశ పరీక్షలో ఏ పాఠ్యపుస్తకం నుండి ప్రశ్నలు రావని, పాత ప్రశ్నాపత్రాలనుంచి కూడా రావని, కేవలం సిలబస్ పరిధిలో విద్యార్థుల నిజమైన ప్రతిభను గుర్తించేలా ప్రశ్నలు తయారవుతాయని తెలిపారు. కేవలం క్లాస్ రూంనుంచే ప్రపంచానికి పనికి వచ్చే గొప్పవారు పుడతారని అన్నారు. గురుశిష్యుల మధ్య జరిగే తర్కమే విద్య అని పేర్కొన్నారు. విద్యార్థుల విజ్ఞానాన్ని గుర్తించి మెరుగుపర్చే విశేషమైన పాత్ర ఉపాధ్యాయుడిదని ఆయన అన్నారు. కార్యక్రమంలో సాయికిరణ్, చొక్కాపు వెంకటరమణ, రిజ్వాన్, ముత్యంరెడ్డి, రమేశ్ రావు, రవికాంత్, విఎస్ జనార్ధనమూర్తి పాల్గొన్నారు. వేదిక్ మ్యాథ్స్ బోధించే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు హాజరయ్యారు.





### ఆహ్వానము


**నీలి ఆకాశంలో ఎర్ర నక్షత్రం**
ప్రజాన్యాయవాది
**బొజ్జా తారకం**
**సంస్మరణ - పుస్తకావిష్కరణ సభ**

19 సెప్టెంబర్ 2019, గురువారం సా॥ 4.00 గం॥లకు
మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం, రాఘవయ్య పార్క్ వద్ద,
బందరు రోడ్డు, విజయవాడ

ఆహ్వానం : **పిచ్చుకా శ్రీనివాస్,** న్యాయవాది (ఐ.ఎ.పి.ఎల్)
అధ్యక్షత : **ఎ.ఎస్.ఎస్. రాంప్రసాద్,** న్యాయవాది (బెజవాడ బార్ హ్యూమన్‌రైట్స్ కమిటి)
ముఖ్యఅతిథి : జస్టిస్ **జాస్తి చలమేశ్వర్** సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

IN QUEST OF EQUALITY IN INDIAN CONSTITUTION SINCE INDEPENDENCE
పుస్తకావిష్కరణ

ప్రచురణకర్త : **నరేన్ బిడిదె,** దిషేర్డ్ మిర్రర్
ఆవిష్కర్త : **ఎ. సత్యప్రసాద్,** సీనియర్ అడ్వకేట్, హైకోర్టు




"ఇది రిజర్వేషన్ల దేశం" పుస్తకావిష్కరణ

ప్రచురణకర్త : **గీతారామస్వామి** హైదరాబాద్ బుక్ ట్రస్టు
వక్తలు : **డి. సురేష్‌కుమార్,** హైకోర్టు న్యాయవాది (సహాయకార్యదర్శి ఐ.ఎ.పి.ఎల్)
: **యు.డి.జె. భీమారావు,** హైకోర్టు న్యాయవాది (తారకం జూనియర్)
: **మాచర్ల మోహన్‌రావు** చేనేత కార్మిక నవసమాఖ్య రాష్ట్రనాయకులు
: డా॥ **బొజ్జా మహిత** బొజ్జా తారకం ట్రస్టు
: డా॥ **బోయి నాగవర్మ** బొజ్జా తారకం ట్రస్టు
: **భీమ్రేడ్ కంచర్ల శేషు** ఆర్.పి.ఐ. ఆంధ్ర రాష్ట్ర కో-ఆర్డినేటర్

ప్రజా కళాకారుడు జనం డప్పుల చప్పుడు
**డప్పు రమేష్** బృందంచే కళాప్రదర్శన

**బొజ్జా తారకం ట్రస్టు, హైదరాబాద్ బుక్ ట్రస్టు**
**భారత ప్రజాన్యాయవాదుల సంఘం (ఐ.ఎ.పి.ఎల్)**
Indian Association of Peoples Lawyers
9849770625, 9885177757, 9441441891



# మహాత్మ శతకం

**అక్టోబరు 2, 2019 గాంధీ మహాత్ముని 150వ జయంతి సందర్భంగా...**



-హెచ్.ఆర్. చంద్రం
సెల్ : 9493248053

వ్రాసియుంటిని నలువది పైనె శతకాలు
నేను నేటి వరకు, నిన్ను గూర్చి
శతక మొకటి వ్రాయ సమకట్టితి నిపుడు
వందనము మహాత్మ, అందుకొనుము !

నేను వ్రాయబోను నీ జీవిత చరిత్ర
ఈ శతకమునందు, నే నెరింగి
యున్న అంశములను విన్నవింతును కొన్ని
వందనము మహాత్మ, అందుకొనుము !

గతమునందు పద్య కవితలు నిను గూర్చి
వ్రాసియుంటి కొన్ని, ప్రస్తుతమ్ము
ఆటవెలది శతక మందించుచున్నాను
వందనము మహాత్మ, అందుకొనుము !

తెలుగుబాస నాటవెలదికి నెంతో గి
రాకి కలదు గాన, వ్రాయుచుంటి
నాటవెలది ఛందమందు నీ శతకమ్ము
వందనము మహాత్మ, అందుకొనుము !

గతమునందు కవులు శతకాలు నిను గూర్చి
వ్రాసియుందు రెన్నొ, వాని నొకటి
యైన చూడలేదు నేనింతవరకును !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను గూర్చి యెంద రెన్నెన్ని వ్రాసిన,
'తుమ్మల' కవితోడ తూగలేరు;
ఆ కవీశు డయ్యె 'ఆస్థాన కవి' నీకు!
వందనము మహాత్మ, అందుకొనుము !

విశ్వ మానవునిగ వెలుగొందినట్టి నీ
ఘనత నెట్లు చెప్పగలను నేను?
సాహసించినాడ సామర్థ్యము మరచి!
వందనము మహాత్మ, అందుకొనుము !

సర్వమును వచింప జాలకున్న, నొకింత
యైన నేను చెప్పలేన యనుచు
శతక రచనమునకు సన్నద్ధుడ నయితి !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను గూర్చి వ్రాయు టన్నచో మా కది
సంతసమ్ము గూర్చు నెంతయేని;
ఇది అదృష్టమంచు నెంచుకొందుము బాపు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నేను గతమునందు నీ సూక్తు లొక కొన్ని
ఆంగ్ల భాష నుండి అనువదించి
తెలుగు గేయములుగ వెలయించి యున్నాను
వందనము మహాత్మ, అందుకొనుము !

విస్తృతముగ వచ్చె వివిధ రూపాలలో
నిన్ను గూర్చి రచన, లెన్న తరమె?
కవులు వదల గలరె కారణజన్ము నిన్ ?
వందనము మహాత్మ, అందుకొనుము !

'జాతి పిత'గ జన్మ సార్థక మొనరించు
కొన్న కర్మయోగి నెన్న తరమె?
అంజలించి జోత లందించుటయ కాని!
వందనము మహాత్మ, అందుకొనుము !

వ్రాతయందు నెంత ప్రావీణ్య మున్న, మ
హాత్ములను స్తుతించు నపుడు కొంత
జంకు పుట్టు ననుట సత్యదూరము కాదు!
వందనము మహాత్మ, అందుకొనుము !

ఉన్న మాట చెప్పుకొన్న చాలును, నిన్ను
గూర్చి చెప్పనేల గొప్ప చేసి!
దేశ హితముగోరి దీక్ష బూనితి వయ్య !
వందనము మహాత్మ, అందుకొనుము !

కొన్ని చాలు నిన్ను కొనియాడుటకు, నీదు
చేత లెల్ల నిచట చెప్పవలెన!
దేశభక్తి నీదు దేహాకృతిని దాల్చె!
వందనము మహాత్మ, అందుకొనుము !

కవిత లల్ల దగునె ఖల నాయకులపైన
వారి నుండి యేదొ కోరి కవులు?
నిన్ను వంటి మహితు నెన్నుకోవలె గాని!
వందనము మహాత్మ, అందుకొనుము !

లేని గొప్ప లద్ది, వేనోళ్ల పొగడిన
ఖలుడు యశము గాంచగలడె జగతి ?
మంచితనము పరిమళించు తనంత తాన్
వందనము మహాత్మ, అందుకొనుము !

నేను చూడలేదు నీ నిజ రూపమ్ము,
కాని బొమ్మలందు గాంచుచుంటి;
నైన నేమి, మాకు ఆత్మీయుడవు నీవు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నీవు కన్నుమూసినావు నా వయసైదు
నెలలు నిండనపుడె; నిన్ను నేను
కన్నులార నెట్లు కాంచగల్గుదు నయ్య ?
వందనము మహాత్మ, అందుకొనుము !

కానవచ్చు నిళ్ల, కార్యాలయముల గో
డలకు వ్రేలు నీ పటాలు చాల;
పోల్చగలరు నీదు 'ఫోటో'ల నెల్లరు!
వందనము మహాత్మ, అందుకొనుము !

పుట్టినావు నీవు 'పోరుబందరు' నందు,
భారతాంబ పుణ్య ఫలమ వగుచు;
తీర్చుకొంటివయ్య దేశమాతృణము !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీ యహింస గూర్చి, నీ సత్యనిష్టను
గూర్చి యచట చెప్పుకొనక చనదు;
ఆయుధమ్ము లయ్యె ఆ రెండు నీ చేత!
వందనము మహాత్మ, అందుకొనుము !

ఇపుడు నూట యేబదేండ్లు, వెయ్యేళ్లైన
జగము నిన్ను మరవ జాలదయ్య;
నిలిచి వెలుగ గలదు నీ యశశ్చంద్రిక !
వందనము మహాత్మ, అందుకొనుము !

ముందు నడచి నీవు మందిని పిలువంగ
అనుసరించినారు జనులు నిన్ను;
నాయకుండు ముందు నడచుటే ధర్మమౌ!
వందనము మహాత్మ, అందుకొనుము !

ఉద్యమాలు నడుపుచున్నప్పు డెన్నేని
కష్ట నష్టములును, కలత లుండు,
ఎదురు దెబ్బలుండు, బెదర వీ వెన్నడు !
వందనము మహాత్మ, అందుకొనుము !

నమ్మకమ్ము కుదిరి నడచిరి నీ వెంట
జనులు తమకు మేలు జరుగు ననుచు;
వారి నమ్మకమ్ము వమ్ము కాలేదయా !
వందనము మహాత్మ, అందుకొనుము !

కలరు దేశభక్తి కలవారు బహు సంఖ్య
నాడు, స్ఫూర్తి నిచ్చినావు నీవు;
స్ఫూర్తి నిచ్చువారు కీర్తనీయులు కదా!
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను విశ్వసించు నీ శిష్యులౌ నెహ్రూ,
శాస్త్రియును ప్రధాన సచివు లైరి;
దేశమునకు సేవ చేసిరెంతో వారు !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఉద్యమాలు నడపి, ఉత్పన్న ఫలముల
యందు సింహభాగ మంద జూచు
నేత లుందు, రట్టి నేతవా? కా వీవు !
వందనము మహాత్మ, అందుకొనుము !

రాజకీయ మెపుడు ప్రజల మేల్గోరంగ
వలయుగాని, స్వార్థ ఫలము గాదు;
నేడు స్వార్థపరులె నేతలౌచున్నారు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నేను చెప్పవలెన నిను గూర్చి ప్రజలకు?
నిను నెరుంగనట్టి మనుజు డున్నె ?
ఎల్లరికిని విదితమే నీ చరిత్రము !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఆత్మకథను వ్రాసి అందించితివి కదా
మాతృ భాషగు 'గుజరాతి'లోన;
అనువదించబడియె నన్ని భాషల కది!
వందనము మహాత్మ, అందుకొనుము !

వివిధ భాష లెరుగు వేలూరి శివరామ
శాస్త్రి నీదు స్వీయ చరితము 'గుజ
రాతి' నుండి సరళరీతి తెన్గించెను!
వందనము మహాత్మ, అందుకొనుము !

నీకు భక్తు డగుచు, నీ ఆత్మ కథ పద్య
కావ్యముగ రచించి ఖ్యాతి గాంచె
'తెనుగులెంక', చేయి తిరిగిన కవి వారు!
వందనము మహాత్మ, అందుకొనుము !

పూలు గట్టు దారమునకు సువాసన
అంటినట్టు, నిన్ను వంటి మహితు
గూర్చి వ్రాయువారు గుర్తింపు పొందరా?
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను గూర్చి వచ్చె నెన్నియో రచనలు,
వీలుపడదు లెక్కపెట్టి చెప్ప;
ఎవరి స్థాయి వారిదే వ్రాతలందున!
వందనము మహాత్మ, అందుకొనుము !

వచ్చియుండు గాక పలు ప్రక్రియలలోన
నిన్ను గూర్చి రచన లెన్నియేని;
మరియు మరియు వచ్చు మహితాత్ముడవు గాన!
వందనము మహాత్మ, అందుకొనుము !

అడ్డమైన వారి నాకాశమున కెత్తు
వ్రాత వ్యర్థ రచన; ప్రజల కొరకు
పాటుపడిన నిన్ను వర్ణించునదె కైత !
వందనము మహాత్మ, అందుకొనుము !

కలవు పేటలకును, గలవు వీథులకు, స
వివరముగను చెప్ప వీలుపడునె?
ఎన్నిటికినొ పెట్టుకొన్నాము నీ పేరు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నీవు కాలు పెట్టినావు మా 'గుడివాడ'
యందు మూడుసార్లు; మందిరమ్ము
కట్టి రిచటి ప్రజలు కడు భక్తితో నీకు!
వందనము మహాత్మ, అందుకొనుము !

'గాంధిబొమ్మ వీథి' కలదు మా ఊర, నీ
విగ్రహమ్ము గలదు వీథి మొదట;
గాంధి అన్న పేరు గలదు పెక్కండ్రకు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను 'బాపు' అనుచు, నిను 'మహాత్ము'డనుచు
గౌరవించుకొనుట కలదు గాని,
అనుసరించజాలమయ్య నీ మార్గము !
వందనము మహాత్మ, అందుకొనుము !

కాలగర్భమందు కలసిపోయిరి నాయ
కులు, యశమ్ము మట్టి గలసిపోయె;
నిన్ను బోలువారు నిలిచియుందురు సదా!
వందనము మహాత్మ, అందుకొనుము !

ఎన్ని కోట్లమంది ఈ భారతావని
లోన పుట్టలేదు; కాని నీకు
సాటి వచ్చువారి సంఖ్య యెంతనవచ్చు?
వందనము మహాత్మ, అందుకొనుము !

కన్నులార నిన్ను గన్నచో నెవరైన
నొక్కసారి, మరచు టుండదింక;
హత్తుకొనును రూపు చిత్తాన చిత్రమై!
వందనము మహాత్మ, అందుకొనుము !

వేడ్క నీదు పేరు పిల్లల కిడుకొని,
పిలిచి తృప్తి పడుట కలదు గతము;
ప్రస్తుతమ్ము కానరా దది, మన్నించు !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను మెచ్చువారు, నీతో విభేదించు
వారు నుండి రపుడు; పదుగు రున్న,
వింత కాదులె మ్మభిప్రాయ భేదాలు !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఎన్నియేని మైళ్లు నిన్ను దర్శించగా
ప్రజలు నడచి వచ్చువారలంట;
బళ్లు కట్టుకొనియు వచ్చెడివారంట!
వందనము మహాత్మ, అందుకొనుము !



దైవమని తలంచి, దర్శించి మొక్కి, సం
తృప్తులైరి నాడు దేశ ప్రజలు;
ప్రణతు లంది తీవు ప్రత్యక్ష దైవమై !
వందనము మహాత్మ, అందుకొనుము !

దేవు డనగ నెవరు ? తెలియు వా రెవ్వరు ?
లేరు చూచినట్టి వారు; తోటి
వారి నుద్ధరించు వారలే దైవాలు !
వందనము మహాత్మ, అందుకొనుము !

దాస్య శృంఖలాలు తప్పించి, దేశవా
సులకు స్వేచ్ఛ నొసగ గలిగినావు;
కాన, అతిశయోక్తి కాదు దేవుడవన్న !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీకు గుడిని కట్టి, నిత్య పూజలు చేయు
నీదు భక్తవరులు నేడు గలరు;
నీవు దేవుడనుచు నెరనమ్మి యున్నారు !
వందనము మహాత్మ, అందుకొనుము !

బాహ్య రూప మరసి పరిహసించినవారె
కార్యదక్షత గని ఖంగు తినిరి;
వారి అంచనాలు తారుమారై పోయె !
వందనము మహాత్మ, అందుకొనుము !



ఆగస్టు 18న నెల్లూరు టౌన్‌హాల్లో కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రాసిన "ఆడిగోపుల అభ్యుదయ కవిత్వం" కావ్యాన్ని ఆవిష్కరించిన ఈతకోట సుబ్బారావు, మోపురూ వేణుగోపాలయ్య, డా॥ శ్రీపాద జయప్రకాష్, సినీ రచయిత వెన్నలకంటి,అడిగోపుల వెంకట రత్నం, టీ రమణయ్య, కొమ్మావరపు విల్సన్‌రావు, పొన్నూరు శ్రీనివాసులు

ఏమి చెప్పమందు, వెందరో నిన్ను సా
ధించ బూని, తలలు దించుకొనిరి;
ఎంచ తరముగాని యెత్తుగడలు నీవి !
వందనము మహాత్మ, అందుకొనుము !

పూల బాట వదలి, ముళ్లదారుల నెన్ను
కొన్న నిను జయించుటన్న చిన్న
పిల్ల లాట యగునె? పెను సవాల్ అగుగాని!
వందనము మహాత్మ, అందుకొనుము !

'అర్ధ నగ్న సాధు'వని నిన్ను ని(వ)ందించె
నంట ఒకరు, దాన నైన దేమి?
అన్న దెవ్వరైన అది సత్యమే కదా!
వందనము మహాత్మ, అందుకొనుము !

కలరు నీకు శత్రువులు రాజకీయాల,
గాని లేరు వ్యక్తిగత విరోధు;
లందరును స్తుతించు వ్యక్తిత్వమౌ నీది !
వందనము మహాత్మ, అందుకొనుము !

ప్రస్తుతమ్ము కానబడదు 'గాంధీ టోపి',
పెట్టుకొనుట మానివేసినారు;
నచ్చకుండె నేటి నాయకులకు టోపి !
వందనము మహాత్మ, అందుకొనుము !

స్వసుఖములను మరచి, స్వజనుల నొప్పించి,
పాటుపడితి వీవు ప్రజల కొరకు;
నచ్చవయ్య నేటి నాయకులకు నివ్వి!
వందనము మహాత్మ, అందుకొనుము !

'గాంధి యుగము' గలదు కద 'గుజరాతి'లో,
బాస సరళతరము చేసి వ్రాసి
మాతృభాషలోన మన్నన గన్నావు !
వందనము మహాత్మ, అందుకొనుము !

చేసి ముందు నీవు చేయమంటివి గాని,
చేయకుండ నెదియు చెప్పలేదు;
కాన, జనులు నమ్మగలిగిరి నీ మాట !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను నమ్మువారు నీవెంట నడచిరి,
నమ్మకున్నవారు నడవరైరి;
నిజము తెలుసుకొనిరి నిల్కడపై వారు!
వందనము మహాత్మ, అందుకొనుము !

హెచ్చు సంఖ్య నిన్ను మెచ్చువా రుండగా,
నింద సేయువారు నేడుగలరు;
వారు చెప్పునట్టి కారణా లల్పముల్
వందనము మహాత్మ, అందుకొనుము !

ఎరుగ జాలదయ్య యెల్లలు నీ కీర్తి,
ప్రాకిపోయె నది ప్రపంచమెల్ల !
నిన్ను జూచి స్ఫూర్తి గొన్నవా రెందరో !
వందనము మహాత్మ, అందుకొనుము !

పుట్టి నీవు నడచినట్టి ఈ నేలపై
పుట్టు టొక వరమ్ము, పుణ్యమనుచు
తలచి తృప్తి పొందగల వార లెందరో !
వందనము మహాత్మ, అందుకొనుము !

అంచితముగ నిను ప్రపంచ మేధావులు
గొప్పచేసి మెచ్చుకొనిరి బాపు;
కీర్తనీయ! నీకు గుర్తింపు చిత్రమా ?
వందనము మహాత్మ, అందుకొనుము !

మేటి నేత లనుచు మిన్నంటు నంతటి
విగ్రహములు ప్రభుత పెట్టుచుండె;
కాని, అందు నీవు కనరావు, చిత్రము!
వందనము మహాత్మ, అందుకొనుము !

అప్పుడెపుడొ పెట్టినట్టివే, ఈనాడు
పెట్ట రెవరు నీదు విగ్రహములు;
గుండె గుడులలోన కొలువుంటి, వది చాలు!
వందనము మహాత్మ, అందుకొనుము !

కన్న బిడ్డలట్లు నిన్ను పిలుతు రయ్య
'బాపు' అనుచు దేశవాసులెల్ల;
బాపు అనగ తండ్రి పర్యాయ పదమేను!
వందనము మహాత్మ, అందుకొనుము !

భారతీయు లెల్ల గారవమ్మున 'జాతి
పిత' వటంచు నిన్ను పిలుచుకొనుట,
తలచుకొనుట తరచు, కొలుచుటయును నుండె!
వందనము మహాత్మ, అందుకొనుము !

ఈవు పుట్టినట్టి ఈ దేశ మననేల?
ఎల్ల దేశములును నెరుగు నిన్ను;
విశ్వ వినుత చర్య! విఖ్యాత జననేత!
వందనము మహాత్మ, అందుకొనుము !

నేటి నాయకులకు నీకు పోలిక యెట్లు?
పాటుపడితి వీవు ప్రజల కొరకు;
వీరు స్వార్థమునకు పోరాడుచుందురు;
వందనము మహాత్మ, అందుకొనుము !

బక్కవాడ వయ్యు, బలవంతులైన ఆం
గ్లేయ పాలకుల నజేయుడవయి
వెడల దరిమినావు కడు సమర్థతతోడ!
వందనము మహాత్మ, అందుకొనుము !

దేశభక్తి నీకు శ్వాస అయ్యెను నాడు,
ప్రజల నొక్క తాటిపైన నడపి
దాస్య శృంఖలాలు తప్పించితివి తుది !
వందనము మహాత్మ, అందుకొనుము !

కనులు మోడ్చి 'గాంధి' అనుకొన్న, ప్రత్యక్ష
మౌచు నీ స్వరూప మద్భుతముగ
చిత్త శాంతి కలుగజేయు మా బోంట్లకు !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీవు చెప్పు మాట, నీ చేయు పని కొంత
మంది మెచ్చుకున్న, మానకుండ
ముందు కరిగి ఫలము లందించితివి కదా!
వందనము మహాత్మ, అందుకొనుము !

పట్టు వదలకుండ, పని పూర్తిచేసి, స
త్ఫలము లందుకొను విధమ్ము నీది;
ఘనులు జారుకొనరు పని వీడి మధ్యలో!
వందనము మహాత్మ, అందుకొనుము !

కొంతమంది యెదుట క్రూర జంతువులును
తలలు వంచి, అచొటు తొలగి చనును;
నేర్చుకొనిరి మంచి నిను జూచి యెందరో !
వందనము మహాత్మ, అందుకొనుము !

కోట్లమంది నిన్ను కొండాడుదురు, కొంత
మంది మొండివాడ వందు; రైన
మొండితన మొకప్పు డుండక తప్పదు!
వందనము మహాత్మ, అందుకొనుము !

నాయకత్వ లక్షణము లన్న ఈనాడు
కులము, ధనము, అంగబలము; నాడు
నీ నిజాయతీయె నిను నాయకుని జేసె!
వందనము మహాత్మ, అందుకొనుము !

కోట్ల జనుల హితము కోరి ఉద్యమము చే
పట్టినపుడు లోటుపాటు లుండు;
అల్ప జనుల కళ్ల కగపడు లోటులే !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఓ మహానుభావ! ఏమి మంత్రము వేసి
నావొ, జనులు నిన్ను నమ్మినారు,
వెంట నడచినారు వేలు-లక్షలలోన !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఉద్యమముల పురుష, లువిదలు నీవెంట
సాగినారు, వారు జడువ లేదు
శిక్షలను గురించి, చెరసాలల దలంచి !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీవు జోలెపట్ట, నిశ్శంకగా తమ
ఒంటిమీది నగల నొలిచి యిచ్చి
దేశభక్తి జాటె స్త్రీ జాతి ఆ నాడు !
వందనము మహాత్మ, అందుకొనుము !

పిలుపు నీయ నీవు, పేరంటమున కేగు
నంత సంబరముగ అనుగమించ
చేరవచ్చినట్టి స్త్రీ మూర్తు లెందరో !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీదు జీవితమ్మె నీవిచ్చు సందేశ
మని వచించినట్టి ఘనుడ వీవు;
కాని, మేము బతుకగలమయ్య నీ లాగ ?
వందనము మహాత్మ, అందుకొనుము !

నీదు నోటి మాట, నీ చేత, నడవడి
మార్గదర్శకాలె మాకు గాని,
ఎంతవరకు సాధ్య మవి మమ్ము బోంట్లకు ?
వందనము మహాత్మ, అందుకొనుము !

అక్షరాస్యు లెల్ల అత్యాదరముగ నీ
ఆత్మకథ పఠించు టవసరమ్ము;
అంతొ యింతొ ఫలిత మద్దాన నొనగూడు !
వందనము మహాత్మ, అందుకొనుము !

ప్రజల మనిషి వీవు, బతుకెల్ల వారికై
మీదుకట్టి కడు శ్రమించినావు;
నేత లేరి నేడు నీతోడ పోల్చంగ ?
వందనము మహాత్మ, అందుకొనుము !

'గాంధి తాత' అనుట కలదు మా చిననాట;
జాతి కీవు పితవు, తాత వైతి
వెల్ల బాలలకును నీ దేశమందున!
వందనము మహాత్మ, అందుకొనుము !

బోసినవ్వు, పిలక, బొడ్డులో గడియార,
మూతకర్ర, జోళ్లు, ముతక పంచె;
వదలకుండ కవులు వర్ణించి రన్నియు !
వందనము మహాత్మ, అందుకొనుము !

సాంఘికార్థి కాది సంస్కరణలు కొన్ని
చెప్పినావు నీవు చేయుమనుచు;
కాని, జరుగకుండె నీ నాటికిని నవ్వి!
వందనము మహాత్మ, అందుకొనుము !

అంటరాని తనము నంతమొందించ ఆ
నాడె ఉద్యమించినావు నీవు;
కాని, యిప్పటికిని కడతేర దా 'బూచి'!
వందనము మహాత్మ, అందుకొనుము !

పగ్గములను నీవు పట్టినదాది స్వా
తంత్ర్య సమర రథము దౌడు పెరిగె;
విజయ మందు వరకు విశ్రామమే లేదు !
వందనము మహాత్మ, అందుకొనుము !

కలరు దేశమందు గాంధేయ వాదులు
నాడు పెద్ద సంఖ్య; నేడు వెదుక
వలసియుండె చూడవలెనన్న వారిని!
వందనము మహాత్మ, అందుకొనుము !
ఖద్దరును ధరించి, గాంధేయ వాదుల
మనుచు తిరుగుచున్న మనుజు లెల్ల
నేర్చి చూపవలదె నీ గుణమ్ములు కొన్ని ?
వందనము మహాత్మ, అందుకొనుము !

మొదలుపెట్టు పనిని తుదిదాక వదలరు
ధీర జనులు, నడుమ జారుకొనరు;
ధీర వరుల ప్రథమ ధీరుడ వగు దీవు !
వందనము మహాత్మ, అందుకొనుము !

కోటు బూటు వదలి, కొల్లాయి గట్టి, సా
మాన్య పౌరునట్లు మనుట నీకె
సాధ్యమయ్యె, నీవు సామాన్యుడవు కావు !
వందనము మహాత్మ, అందుకొనుము !

తప్పు జరిగినపుడు, తప్పక అద్దాని
నొప్పుకొనుటె కాదు, తప్పు దిద్దు
కొనగ నీవు పూనుకొను విధానము గొప్ప !
వందనము మహాత్మ, అందుకొనుము !

లోనుగాక యే ప్రలోభాలకును, నచ్చి
నట్టి మార్గమందె నడచినావు;
కొంతమంది నొచ్చుకొని యుండవచ్చును!
వందనము మహాత్మ, అందుకొనుము !

కొంతమంది పేరు కొరకు నటింతురు
లేని ప్రేమ ప్రజలపైన జూపి;
నీ వెరుంగ వట్టి నీచ కృత్యము లెప్డు !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిరశనవ్రతమ్ము నీవు నేర్పిన విద్య,
నీరు కార్చినారు నేత లిపుడు;
చీటిమాటి కదియె చేపట్టుచున్నారు !
వందనము మహాత్మ, అందుకొనుము !

భేషజాలు మాని, భేషుగా జీవించ
వచ్చునని వచించి, బతికి చూపి
మెప్పుగొన్న నీవు మేటి మానిసి వయ్య !
వందనము మహాత్మ, అందుకొనుము !

నీ నిజాయతీయె నీకు బ్రహ్మరథమ్ము
పట్టునట్టు చేసె ప్రజలలోన;
నటన పనికిరాదు నాయకత్వమునకు !
వందనము మహాత్మ, అందుకొనుము !

చలన చిత్ర మొకటి వెలువడె నీపైన,
తీయలేదు భారతీయు లద్ది;
అన్య దేశవాసి అద్దాని నిర్మించె!
వందనము మహాత్మ, అందుకొనుము !

నేటి నాయకులకు నీ పద్ధతులు కొన్ని (చాల)
నచ్చకుండు, నిజము; నచ్చునవియు
ఆచరించబోవ, రదె కదా మా 'ఖర్మ'!
వందనము మహాత్మ, అందుకొనుము !

తెల్ల దొరల దోలి, దేశ నేతల చేత
ఏలుబడిని పెడితి, వేమి ఫలము ?
సగటు మనిషి బతుకు సంక్లిష్టమై పోయె !
వందనము మహాత్మ, అందుకొనుము !

ఓటు చేతబెట్టి ఊరించి రెంతేని,
ఓటు వలన నేమి ఒరిగె ప్రజకు ?
అమ్ముకొనుట, కొనుట; అది సంత సర కాయె!
వందనము మహాత్మ, అందుకొనుము !

అన్ని గాక యున్న, కొన్నియైనను నీ గు
ణాలు నేర్చుకొన్న చాలు, వాని
జన్మ తప్పకుండ సార్థకమై తీరు !
వందనము మహాత్మ, అందుకొనుము !

బ్రతికి చూపితివి నిరాడంబరమ్ముగా,
నేర్వవలయు ప్రజలు నిన్ను జూచి;
కాని, నేర్వరాయె గాంధేయులను వారె!
వందనము మహాత్మ, అందుకొనుము !

దైవమట్లు ప్రజల కైవారముల నందు
కొన్న నిన్ను చంపుకొన్న జాతి
చేయరాని తప్పు చేసె! నిష్కృతి లేదు !
వందనము మహాత్మ, అందుకొనుము !

లేవు భౌతికముగ నీవు మా మధ్య, నీ
కీర్తికాయ ముండె మూర్తి గట్టి;
శాశ్వతమ్ములౌ యశః కాయములు గదా!
వందనము మహాత్మ, అందుకొనుము !

పండితుడను గాను, పరిమితజ్ఞుడ, నైన
కవిత లల్లు నేర్పు కలదు గాన
శతకమున స్మరింప జాలితి నిన్నిట్లు !
వందనము మహాత్మ, అందుకొనుము !

నిన్ను గూర్చి శతక మిన్ని నాళ్లకు నైన
వాయిదాలు మాని వ్రాసినాడ;
అబ్దములకు మున్నె అనుకొన్న పని యిది!
వందనము మహాత్మ, అందుకొనుము !

అయ్య ! నిన్ను గూర్చి అతిమాత్రముగ చెప్ప
వచ్చు, శతక పరిధి స్వల్పమగుట
కొంత చెప్పి ఊరకొంటిని, తప్పదు!
వందనము మహాత్మ, అందుకొనుము !

అంతొ యింతొ తెలిసినంతలో నొక్కింత
పొందుపరచినాడ నిందు, పాఠ
కులకు నచ్చవలయు; సెల వొసంగుము, తుది
వందనము మహాత్మ, అందుకొనుము !

## కడారు మనో గీతికలు

గెలుపు కల్గిస్తుంది గుప్పెడు సంతోషం
క్షణికమైన తియ్యని జ్ఞాపకం!
ఓటమి మాత్రం చేదే
అది జీవితాంతం మరిచిపోని
ఔషధం!

కురు సభలో కృష్ణుడొక్కడే
అందరి ఆట కట్టించాడు!
'ప్రపంచ కప్' లో విరాట్ కోహ్లి ఒక్కడే
'కంగారూలను' కంగారులోకి
నెట్టేసాడు!

రెండు వైపులా బొమ్మంటే
చెలామణి అవుతుందా నాణెం?
గాజు పెంకులో
కనిపిస్తుందా మన ముఖం?

చేనుపై మిడతల దండు వాలితే
పండిన పంటంతా పాడే!
ప్రజాస్వామ్యానికి
చీడపురుగులు పడితే అంతే!

తిమిరాన్ని కొప్పుగా చేసికొన్న ఆకాశం
చుక్కల్ని పూలుగా తురుముకొన్నది!
కష్టాలే జీవితమా
నవ్వులకో అంతరాయం ఉందని మరిస్తే ఎట్లా?


బ్రతుకు మొదట్లో
శిలా సదృశమే!
ప్రతిభ లేకపోతే
శిల్పం అదృశ్యమే!

ఎవరి జీవితంలోనైనా
పూలూ, ముళ్ళూ.. రెండూ ఎదురౌతాయి
విచక్షణతో ఒకటి ఏరుకోవాలి
ఇంకొకటి ఏరి పారేయాలి!



-కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

# దేశ భాషలు-హిందీ భాష-ఫెడరలిజం



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
పూర్వ చైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

హిందీ జాతీయ భాష, ఇంగ్లీషు అంతర్జాతీయ అనుసంధాన భాష, ప్రాంతీయ భాషలు ఫెడరలిజానికి చిహ్నం. హిందీ జాతీయ భాషగా అందరూ ఉపయోగించాలని అమిత్‌షా ఇటీవల హిందీ దివస్ సందర్భంగా పేర్కొన్నారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా అలాంటి మాటలు చెప్పడం సహజం. దాన్ని రాద్ధాంతం చేయడం అనవసరం. రాద్ధాంతం చేయకపోతే నిజంగానే రుద్దుతారు అని ఇతర భాషలవాళ్ళు భావించడం కూడా అంతే సహజం. కొన్ని పత్రికలు భారతదేశంలో హిందీ భాష ఒక్కటే అని అమిత్‌షా అన్నట్లు రాశాయి. అలాంటిదేమీ జరిగే అవకాశం లేదు. రూపాయినోట్లమీద ఎన్ని భాషలున్నాయో అవన్నీ భారతీయ భాషలే. హిందీ ఒక్కటే భాష అని నిజంగానే నమ్మితే రూపాయి నోట్లమీద ఇంగ్లీషుతో సహా భారతీయ ఇతర భాషలను అచ్చువేయడం మానేస్తారు. ఫెడరలిజం దృష్టితో భారత రాజ్యాంగంలో భాషలకు సంబంధించిన ఆర్టికల్స్ ప్రత్యేకంగా ఉన్నాయి. అన్ని భాషలను అభివృద్ధి పరుచుకునే అవకాశం, కర్తవ్యం గురించి ఆ ఆర్టికల్స్ పేర్కొంటాయి. భారత రాజ్యాంగం ఆర్టికల్ 343లో హిందీని దేవనాగరిలిపితో కేంద్ర ప్రభుత్వం అధికార భాషగా పేర్కొనడం జరిగింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 15 సంవత్సరాల వరకు ఇంగ్లీష్‌లో గతంలో వలె ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలని పేర్కొనడం జరిగింది. ఆ తర్వాత కూడా ఇంగ్లిష్ గానీ, హిందీగానీ ఉపయోగించుకోవచ్చు అని చెప్పడం జరిగింది. ఆర్టికల్ 344లో ఎనిమిదో షెడ్యూల్లో పేర్కొన్న వివిధ భాషల సభ్యులతో అధికార భాషపై ఒక పార్లమెంట్ కమిషన్ ఏర్పాటు చేయాలని పేర్కొనడం జరిగింది. అధికార వ్యవహారాల్లో హిందీ వాడుకను పెంచుట, ఇంగ్లిష్ వాడుకను తగ్గించుట కోసం కమిషన్ సూచించాలి. ప్రాంతీయ భాషల గురించి 345 ఆర్టికల్‌లో రాజ్యాంగం అమల్లోకి రాకముందు వలెనే ఇంగ్లిష్‌లో వ్యవహారాలు నిర్వహించుకోవాలి అని పేర్కొనడం జరిగింది. తమ ప్రాంతీయ భాషను, భాషలను రాష్ట్ర అధికార భాషలుగా ప్రకటించుకుంటూ శాసనాలు చేసుకోవచ్చు. ఈ శాసనాలు ఈ అధికార భాషలు 346,347 ఆర్టికల్స్‌కు లోబడి ఉండాలి. 346 ఆర్టికల్‌లో కేంద్రానికి, ఆయా రాష్ట్రాల మధ్య వ్యవహారాలు ఏ భాషలో జరుగుతున్నాయో, అట్టి ఇంగ్లిష్ భాషలో జరుపుకోవాలి. ఆర్టికల్ 347 ఆయా రాష్ట్రాల్లోని అల్పసంఖ్యాకుల భాషలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వవచ్చు. రాష్ట్రపతి ఆమోదంతో ఆ భాషలను ప్రాంతీయ అధికార భాషగా అమలు జరుపుకోవచ్చు. ఆర్టికల్ 348లో సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో మరియు శాసనాల్లో ఇంగ్లిష్ భాషను ఉపయోగించాలని పేర్కొనడం జరిగింది. ఇలా అంతిమంగా హిందీని, ప్రాంతీయ భాషలను వాటి అభివృద్ధిని, వ్యాప్తిని కోరినప్పటికీ ఇంగ్లిష్‌కే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఆర్టికల్ 349లో రాష్ట్రపతి అనుమతి లేకుండా వాడుక భాషకు సంబంధించిన శాసనాలను మార్చుకోవడానికి వీలులేదు. ఇలా స్వాతంత్రానికి పూర్వం ఆయా ప్రాంతాలు, రాష్ట్రాలు కేంద్రం మధ్య ఇంగ్లిష్, ప్రాంతీయ భాషల వ్యవహారాలు స్వాతంత్ర్యం అనంతరం కూడా కొనసాగాలని పేర్కొనడం జరిగింది.ఆర్టికల్ 350లో ప్రజలు తమ విన్నపాలను కేంద్రంగానీ, రాష్ట్రాలు గానీ ఉపయోగించే ఏ భాషలోనైనా చేసుకోవచ్చని పేర్కొనడం జరిగింది. అల్ప సంఖ్యాక భాషల వారికి ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యా బోధన చేయాలని ఆర్టికల్ 350-ఏలో నిర్దేశించడం జరిగింది. భాషా మైనార్టీల గురించి ప్రత్యేక అధికారిని నియమించాలని 350-బి ఆర్టికల్‌లో స్పష్టం చేయడం జరిగింది. 351 ఆర్టికల్‌లో హిందీ భాషా అభివృద్ధికి సూచన చేయడం జరిగింది. భారత దేశంలోని విభిన్న సంస్కృతులు, విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రజల మధ్య భావ వ్యక్తీకరణ కోసం హిందీని అభివృద్ధి చేయడం కేంద్ర ప్రభుత్వ కర్తవ్యం. అందుకు అవసరమైతే సంస్కృతాన్ని ప్రాథమిక మూలంగా స్వీకరిస్తూ, ఎనిమిదో షెడ్యూల్లోని ఇతర భాషలతో సమ్మిళితం అవుతూ, హిందుస్థానీ పదోచ్ఛారణకు తగిన ప్రాధాన్యత ఇస్తూ, హిందీ భాష కోసం కృషి చేయాలి అని పేర్కొనడం జరిగింది.హిందీ వ్యాప్తికి దక్షిణ భారత ప్రచార సభ, హైదరాబాద్ హిందీ ప్రచార సభ వంటివి ఏర్పడ్డాయి. వారు విశారద, భాషభూషణ్ వంటి కోర్సులు నిర్వహించి హిందీ పండిట్ ఉద్యోగాలకు అర్హులుగా ఉత్తర్వులు సాకారమవుతాయి. ఇది ఎంత కష్టమో చెప్పనవసరం లేదు. దేవతల పేరిట జాతీయం చేయడం జరిగింది. హిందీని రెండో భాషగా ఆప్షనల్‌గా తీసుకునే వారికి ప్రోత్సాహకంగా ఒకప్పుడు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరిగింది. చివరకు శివకేశవులు ఒక్కటే అని అయ్యప్పను సృష్టించారు. త్రిమూర్తులు ఒక్కటే అని దత్తాత్రేయను సృష్టించారు. రాముడికి, రావణుడికి ఈ ప్రకారంగా ఆయా రాష్ట్రాలు తమ ప్రాంతీయ భాషలను అధికార మధ్య దక్షిణాదికి, ఉత్తరాదికి మధ్య వ్యతిరేక దృక్పథాలున్నాయి. ఇలా ఎన్నైనా భాషలుగా ప్రకటించుకున్నాయి. అన్నిస్కూల్లలో పాఠ్యపుస్తకాల్లో చెప్పుకుంటూ వెళ్లవచ్చు. హిందీ ఆధిపత్యవాదం ఒకే దేశం, ఒకే భాష, ఒకే ప్రవేశపెట్టాయి. కానీ, తమ రాష్ట్రంలోని ఆదివాసీ, సంచార జాతుల, ఎన్నికలు అనే ప్రచారం ద్వారా ఉత్తరాదివారు తమ ఆధిపత్యాన్ని భాషా మైనార్టీల భాషల అభివృద్ధికి, వారి భాషల్లో ప్రాథమిక విద్య స్థిరపర్చుకోవడం కోసం హిందూ మతం పేరిట, వర్ణ వ్యవస్థను స్థిరపర్చడం అందుకోవడానికి చేసిన కృషి చాలా తక్కువ. ఫెడరలిజం గురించి కోసం, పునరుద్ధరణ కోసం చేస్తున్న ప్రయత్నాల వెనుక దేశ చెప్పున్న మాట్లాడే రాష్ట్రాలు తమ పరిధిలో మైనార్టీ భాషల పట్ల ఫెడరలిజం రాజ్యాలుగా, దక్షిణాది, ఉత్తరాది దేశాలుగా విడిపోవడానికి మార్గం వేస్తున్నారు. స్వేచ్ఛను ఆచరించింది అత్యల్పం. ఆర్టికల్ 344,350కు అనుబంధంగా కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు దక్షిణాదివారు ఏది కోరుకుంటున్నారో పేర్కొన్న ఎనిమిదో షెడ్యూల్లో ఆయా రాష్ట్రాల ప్రాంతీయ అధికార దాన్ని ఉత్తరాదివారు రెచ్చగొట్టి ముందుకు తెస్తున్నారు. హిందీ వ్యతిరేకత భాషలుగా ఈ కింది వాటిని పేర్కొనడం జరిగింది. అస్సామీ, బెంగాలీ, దక్షిణాదికి పరిమితం కాదు. బెంగాల్ వాళ్ళ హిందీని దక్షిణాదికన్నా ఎక్కువే బోడో, డోంగ్రీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణి, మైథిలి, వ్యతిరేకిస్తుంటారు. యూరప్ వాళ్ళ సముద్ర తీరాల ద్వారా రావడం వల్ల మళయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒడియా(ఒరియా), పంజాబీ, దేశాన్ని సముద్ర తీర ప్రాంతాల పట్టణాలు వెలిశాయి. అక్కడ నుండి దేశం సంస్కృతం, సంథాలి, సింధి, తమిళం, తెలుగు, ఉర్దూ. ఇలా ప్రాంతీయ లోపలికి ప్రవేశించారు. అందువల్ల డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లిష్ భాషలు సముద్ర భాషలు అధికార భాషలుగా కొనసాగుతాయి. హిందీ, ఇంగ్లిష్‌లు తీర ప్రాంతాలలో, రాష్ట్రాలలో అనుసంధాన భాషగా వ్యాప్తి చెందుతూ మాధ్యమం భాషలుగా కొనసాగుతాయి. హిందీ ఒక్కటే దేశ భాషగా, వచ్చింది. గోభూమి, గంగాతీర మైదానాల్లో ఇంగ్లిష్ కాస్త లేటుగా చేరింది. జాతీయ భాషగా మార్చాలంటే రాజ్యాంగంలోని అనేక ఆర్టికల్స్‌ను అందువల్ల ఉత్తరాది వారు హిందీని జాతీయభాషగా ఉండాలని రద్దు చేయడం, మార్చుకోవడం అవసరం అవుతుంది. అంతదాకా కోరుతారు. అది సహజం. అయితే అవి వారి మాతృభాష మిగతా రాష్ట్రాలకు ప్రభుత్వంలో ఉండేవారు రాజ్యాంగంలో ఉన్న ప్రకారం మాట్లాడవలసి ఇతర భాషల వారికి అది మాతృభాష కాదు. మాతృభాష ద్వారానే విద్యావికాసం, వివేచన ఎదుగుతుంది అని అందరు అంగీకరించిందే. ప్రపంచాన్ని శాసించిన జపాన్, జర్మనీ, రష్యా, చైనాల్లో వారి మాతృభాషే కొనసాగుతున్నది. భారతదేశంలో కూడా మాతృభాష ద్వారానే వ్యవహారాలు కొనసాగడం అవసరం.మాతృభాష కాని భాషను, అనుసంధాన భాషగా ఉండాలని కోరితే అప్పుడు ఇంగ్లిష్‌కు అందరూ సమానులు అవుతారు. కొందరు హిందీకి బదులుగా సంస్కృతం అనుసంధాన భాషగా ఉంటే బాగుంటుందని అనుకుంటారు. ఎప్పుడు బాగుంటుంది అంటే కేజీ టు పీజీ విద్య గురుకుల పాఠశాలల ద్వారా దేశంలో అందరికీ ఒకే విధమైన గురుకుల పాఠశాలలో, పాఠ్యంశాలతో సంస్కృతంలో విద్య అందించిన తర్వాత ఓ రెండు దశాబ్దాలకు సంస్కృతం అందరికీ అనుసంధాన భాషగా రూపొందించవచ్చు. ఆ పని చేయకుండా హిందీనిగాని, సంస్కృతాన్ని గాని జాతీయభాషగా అందరు వాడాలి అని అనడం తిండి పెట్టకుండా పహిల్వాన్లు కావాలని కోరినట్టుగా ఉంటుంది. నర్సరీ నుండి కేజీ నుండి పీజీ దాకా ఇంగ్లిష్‌లో చదువుకోవడం వల్ల కొంతమందికి తీవ్రమైన నష్టం కలుగుతున్నది. హిందీ, సంస్కృతం మాతృభాష కాని వారికి, అలవాటు లేనివారికి కూడా అలాగే తీవ్ర నష్టం జరుగుతుంది. ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నికలు, ఒకే మతం, ఒకే దేవుడు, ఒకే పార్టీ అనేవి ఒకే కోవకు చెందినవి. అందువల్ల, ఇవి అసాధ్యమని కొందరు అనుకుంటారు. సాధ్యం కానిదంటూ ఏదీ లేదని చెప్పేవాళ్లు ఇది మాత్రం అసాధ్యమని ఎందుకు అనుకుంటారో తెలియదు. ఎక్కడిక్కడ యూరప్, అరబ్ దేశాల వలె ఆయా భాషలవారీగా, ప్రాంతాల వారిగా మతాల వారీగా, దేవుళ్లవారీగా, పార్టీల వారీగా ప్రత్యేక దేశాలుగా, స్వతంత్ర దేశాలుగా ఏర్పడినప్పుడు ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నికలు, ఒకే దేవుడు వంటివన్నీ సాకారం అయ్యే అవకాశం ఉంటుంది. దీనికి అటువైపు నుండి కృషి చేస్తూ, ఒత్తిడి తెస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ పరివారం ఫెడరలిస్టు దేశం స్థానంలో "భారత ఉపఖండ, కామన్‌వెల్త్ దేశాల"వంటి ఫెడరలిజానికి బాటలు వేయడం జరుగుతున్నది. మార్క్సిస్టులు చెప్పే జాతుల స్వయం ప్రతిపత్తి, భాషల స్వయంప్రతిపత్తి, మతాల స్వయం ప్రతిపత్తి, ఆర్ఎస్ఎస్ పరివారం కొత్తభాషలో, కొత్త నినాదాలతో ముందుకు తేవడం జరుగుతున్నది. ఉమ్మడి కుటుంబాలు విడిపోయినట్లుగా ఉమ్మడి దేశం, "ఇండియన్ కాంటినెంట్ కామన్‌వెల్త్ దేశాలు"గా కలిసి ఉండడటానికి కొత్త వ్యవస్థ రూపకల్పనకు మత రాజకీయాలు, హిందీ రాజకీయాలు, ఉత్తరాది రాజకీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. దేశ ఐక్యతకు బదులుగా, ఫెడరలిస్టు కామన్‌వెల్త్ దేశాల వలె, యూరప్ యూనియన్ వలె విడిపోయి కలిసుండటానికి బాటలు వేయడం వల్ల భవిష్యత్ ఎలా ఉంటుందో ఇప్పుడప్పుడే చెప్పలేం.

> **దేశ ఐక్యతకు బదులుగా, ఫెడరలిస్టు కామన్‌వెల్త్ దేశాల వలె, యూరప్ యూనియన్ వలె విడిపోయి కలిసుండటానికి బాటలు వేయడం వల్ల భవిష్యత్ ఎలా ఉంటుందో ఇప్పుడప్పుడే చెప్పలేం.**

ఉంటుంది. హోంమంత్రిగా ఉన్న అమిత్‌షాకు ఈ విషయాలను సంబంధిత అధికారులు గుర్తుచేయడం వారి కర్తవ్యం.మతం ఒక్కటే అయినప్పటికీ ప్రాంతాలు, సంస్కృతి, భాషలు, ప్రత్యేక అస్తిత్వం, ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నందున యూరప్ దేశాలు, గల్ఫ్ దేశాలు ఒకే దేశంలోని రాష్ట్రాలుగాకాకుండా ప్రత్యేక దేశాలుగా ఏర్పడ్డాయి. రష్యాలో అరవై ఏళ్లు కలిసి ఉన్న తర్వాత పదమూడు దేశాలుగా విడిపోవడంలో భాషా, సంస్కృతుల ప్రత్యేకత పాత్ర తక్కువేమీ కాదు.గాంధీజీ జాతీయ భాషగా ఉండాలని హిందీని కాకుండా హిందుస్థానీ భాషను జాతీయ భాషగా ఇంగ్లీషుతోపాటు కొనసాగించడం అవసరమని జాతీయ ఉద్యమ కాలంలో భావించడం జరిగింది. సోవియట్ యూనియన్ అనువాదాలు హిందీలో కాకుండా, హిందుస్థానీ భాషలో వెలువరిస్తూ రావడం గమనించడం అవసరం. మహా రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ ఉర్దూ, హిందుస్థానీ భాషల్లోనే రచనలు చేశారు. హిందుస్థానీ భాష అంటే ప్రజల భాష ఖడిబోలి, ఉర్దూ, హిందీ కలిసి ప్రజలు మాట్లాడుకునే భాష హిందుస్థానీ భాష. ఈ భాష ప్రధానంగా ప్రస్తుతం ముంబాయి, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్నది. హిందీ రుద్దినప్పుడల్లా త్రిభాషా సూత్రం ముందుకు వస్తుంది. రామ్‌మనోహర్ లోహియా అన్నీ బాగా చెప్పి, హిందీ గురించి దక్షిణాది నేర్చుకోవాలని చెప్పేసరికి తిరుగుబాటు ఎదుర్కోక తప్పలేదు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు, ఒకే భాష చివరకు ఒకే పార్టీ అనే దిశగా మారవచ్చు. అయితే ఒకే దేశం, ఒకే దేవుడు అతడే సర్వేశ్వరుడు అని కూడా చెప్పి బహు దేవతారాధన నుండి ఏకేశ్వరోపాసనకు సగుణ, నిర్గుణ దేవతోపాసనను రెంటింటికి పరిమితం చేసి దేశాన్ని ఒక్కటి చేయడం జరిగినప్పుడే ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నికలు, ఒకే పార్టీ అనేవి సాధ్యమవుతాయి.

## మానవ విలువలను ఆవిష్కరించిన 'మై గరీబ్ హూ'




ధనిక, పేదల వ్యత్యాసాలను ఆవిష్కరించిన ప్రత్యేక నవల 'మై గరీబ్ హూ' అని ప్రముఖ సాహితీవేత్త తాటికొండల నర్సింహారావు అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శుక్రవారం నిర్వహించే నవలా ప్రవంతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నవలా ప్రవంతి-6ను రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలు నిర్వహించారు. నవలా ప్రవంతి-6లో కవిరాజ మూర్తి రచించిన 'మై గరీబ్ హూం' నవలపై తాటికొండల నర్సింహరావు ప్రత్యేక ప్రసంగం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ, రచయిత కవిరాజ మూర్తి మానవతామూర్తి అన్నారు. వందల ఎకరాల భూస్వామి అయినప్పటికీ గరీబుల బతుకులు, తీరు తెన్నులను గొప్పగా ఆవిష్కరించారని సిధారెడ్డి అన్నారు. సమావేశంలో ప్రారంభ ఉపన్యాసాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నర్సింహారెడ్డి చేశారు. కార్యక్రమంలో కవిరాజ మూర్తి కుమార్తె శేష పద్మ, పలువురు సాహితీవేత్తలు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఆహ్వానం

'అమ్మయాది' పెండెం ఫౌండేషన్
( సాహిత్య, సామాజిక, విద్య, కళా సేవా సంస్థ )

8వ వార్షికోత్సవం

వేలాది కవుల, కవయిత్రుల కవితలను
వెలుగులోకి తెచ్చిన 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు, కవి
శ్రీ బైస దేవదాసు గారికి
జీవన సాఫల్య పురస్కార ప్రదానం

కవులకు సాహిత్య పురస్కార ప్రదానం

ఉత్తమ ఉపాధ్యాయులకు, ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం

వేదిక : ప్రాథమిక పాఠశాల ప్రాంగణం, బ్రాహ్మణపల్లి
మం॥ గుండాల, యాదాద్రి భువనగిరి జిల్లా.
తేది & సమయం : 22.09.2019, ఆదివారం ఉ॥ 10.30 ని॥లకు

ఆహ్వానించువారు
పెండెం సత్యనారాయణ - లక్ష్మి దంపతులు
వ్యవస్థాపకులు, 'అమ్మయాది' పెండెం ఫౌండేషన్
బ్రాహ్మణపల్లి, మం॥ గుండాల, జిల్లా యాదాద్రి భువనగిరి
సెల్ : 8247312054, 9704419008
మరియు
పెండెం రామచందర్, పెండెం పరంధాములు, పెండెం సుధర్మ

ఈ కార్యక్రమంలో...
సభా ప్రారంభకులు : శ్రీ కంచర్ల రామకృష్ణారెడ్డి గారు, చైర్మన్, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పోరేషన్
సభాధ్యక్షులు : శ్రీ సుద్దాల సుధాకర్ తేజ గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
ముఖ్య అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు ప్రముఖకవి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
గౌరవ అతిథి : శ్రీ ఎస్. హరగోపాల్ గారు, ప్రముఖకవి, చరిత్ర పరిశోధకులు
మాన్య అతిథులు : శ్రీమతి తాండ్ర అమరావతి శోభన్‌బాబు గారు, ఎం.పి.పి. గుండాల మండలం
శ్రీమతి కోలుకొండ లక్ష్మి గారు, జడ్.పి.టి.సి. గుండాల మండలమం
ఆత్మీయ అతిథులు : శ్రీమతి బండారు సంధ్య శ్రీనివాస్ గారు, సర్పంచ్, బ్రాహ్మణపల్లి
శ్రీమతి పాయిలి కవిత శ్రీనివాస్ గారు, ఎం.పి.టి.సి, బ్రాహ్మణపల్లి - సుద్దాల
అతిథులు : శ్రీ నెల్లుట్ల రవీందర్ రావు గారు, వ్యవస్థాపకులు, నెల్లుట్ల ఫౌండేషన్, జనగామ
డా॥ వాకిటి రాంరెడ్డి గారు, ప్రముఖ హోమియో వైద్యులు, హైదరాబాద్
శ్రీ గట్టు శ్రీనివాసాచార్యులు గారు, సంపాదకులు, ' అష్టాక్షరి ' మాసపత్రిక

-: పురస్కార గ్రహీతలు :-
జీవన సాఫల్య పురస్కార స్వీకర్త
శ్రీ బైస దేవదాసు గారు


-: సాహిత్య పురస్కార స్వీకర్తలు :-
శ్రీ మెరుగు వెంకటదాసు గారు
శ్రీ గోపగాని రవీందర్ గారు
శ్రీ దేవినేని అరవిందరాయుడు గారు

-: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార స్వీకర్తలు :-
శ్రీ బత్తిని భిక్షపతి గారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు
శ్రీ అండెం వెంకటరెడ్డి గారు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు
శ్రీ గూడ రాజబోసు గారు, ప్రధానోపాధ్యాయులు
శ్రీ సీత దామోదర్ గారు, హిందీ పండిట్
శ్రీ తిరువీధి ప్రభాకర్ గారు, పి.ఇ.టి

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

## దువ్వూరి కవిత్వంలో రైతూ ప్రకృతీ రమణీయం

"అమరావతి సాహితీమిత్రులు" సభలో ప్రముఖ పరిశోధకులు డా. ఎమ్వీయస్ ప్రసాదరావు




"కవి కోకిల" దువ్వూరి రామిరెడ్డి కవిత్వంలో రైతు పక్షపాతం, ప్రకృతి రామణీయకత గుబాళిస్తా యని ప్రముఖ సాహితీవేత్త డా. ముప్పాళ్ళ వెంకట శివ ప్రసాదరావు తెలిపారు. "అమరావతి సాహితీమిత్రులు" గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం నిర్వహించిన "దువ్వూరి సాహిత్య ప్రత్యేక కార్యక్రమం"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దువ్వూరి "కృషీవలుడు" కావ్యం గురించి ప్రసంగించారు. రైతు గురించి ఆవేదన, ప్రకృతి పట్ల ఆరాధన కనిపిస్తాయని వివరించారు. సూర్యోదయం నుండి రైతు పక్కమీద విశ్రమించే రాత్రి దాకా అనేక సంఘటనల్ని సన్నివేశాల్ని సందర్భాల్ని కవి అద్భుతంగా చిత్రించారని అన్నారు. ప్రతి పద్యం ఒక ముక్తకంలా ఉంటూనే పూస లన్నీ ఒక క్రమంలా కూర్చబడిన అందమైన దండలా కావ్యం అల్లారని పేర్కొన్నారు. "కృషి సకల పరిశ్రమలకు కీలు చీల" అంటూ రైతు చేసే రకరకాల పనుల్ని మనోహరంగా వర్ణించా రన్నారు. "ఫలముల్ మెక్కెడి వారు... తత్ఫల హేతు క్రమ వృక్షము" మరిచిపోతున్నా రని రైతు పట్ల ప్రపంచం శ్రద్ధ వహించాలని కోరారు. రైతు భార్య రైతుకే కాకుండా వ్యవసాయానికి కూడా గొప్ప సాయం అందిస్తుందని రాసిన పద్యాలు గొప్ప తెనుగు నుడికారంతో పరిమళిస్తా యన్నారు. సంస్థ సంస్థాపకులు డా. రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో "ఈ మాసం కవి" గా కేంద్ర సాహిత్య అకాడెమి యువ కవి పురస్కార గ్రహీత మంత్రి కృష్ణ మోహన్ (చీరాల) పాల్గొని వినిపించిన కవితలు సభను అలరించాయి. మార్కాపురం పలకల గురించి, మనిషి గుండె కాయ గురించి, సమాజంలో కవి బాధ్యత గురించి అనేక కవితలు చదివి వినిపించారు. సంస్థ కన్వీనరు పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో కనగాల జయకుమార్, అన్నాప్రగడ వెంకట నరసింహారావు, గోలి హనుమచ్ఛాస్త్రి, మన్నం వెంకట గురువు, లంక మాధవి, యక్కంటి పద్మావతి, బలభద్రపాత్రుని ఉదయశంకర్ మొదలైన కవులు పాల్గొన్నారు. "ఈ మాసం కవి"గా పాల్గొన్న కృష్ణమోహన్ ను ప్రముఖ సోషలిస్ట్ నాయకులు మోదుగుల పాపిరెడ్డి, ప్రముఖ కవి ధనేకుల వెంకటేశ్వరరావు, డా. రావి రంగారావు, ఎ.వి.కె.సుజాత ఘనంగా సత్కరించారు.


## అలరించిన సినీ సంగీత విభావరి



గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న కళా జనార్ధనమూర్తి తదితరులు

శ్రీ ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరవోకే సినీ సంగీత విభావరి అలరించింది. శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రమణమూర్తి, పేరి నాగేశ్వరరావు, పేరి విజయలక్ష్మి, అర్చన వెంకటేశ్వరరావు, టీవీ రావు, లలితారావు, సుజాతామూర్తి తదితరులు గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ గౌరీశంకర్‌ను గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి సన్మానించారు.

## దాశరథి చలన చిత్ర గీతాలు గ్రంథం ఆవిష్కరణ



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం ప్రముఖ పాత్రికేయులు అరవల్లి జగన్నాథస్వామి సిద్ధాంత గ్రంథం దాశరథి చలనచిత్ర గీతాలు-విమర్శనాత్మక పరిశీలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు డాక్టర్ కె. శ్రీనివాస్, వాణిజ్యశాఖ అడిషనల్ కమీషనర్ వై. సత్యనారాయణ. పాలపిట్ట ప్రచురణల అధినేత గుడిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




సెప్టెంబర్ 7న సారథి స్టూడియోస్ ప్రివ్యూ థియేటర్‌లో యువకళావాహిని ప్రచురించిన గురుప్రసాద్ మీడియా డైరెక్టరీ-2019 జమున విడుదల చేయగా కవిత, బాబూమోహన్‌లు గుదిబండికి డైరీ ప్రతిని బహూకరిస్తున్న దృశ్యం. చిత్రంలో వి.వి. రాఘవరెడ్డి, డా॥ మహమ్మద్ రఫీ, సారిపల్లి కొండలరావు ,



ఆగష్టు 8 ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్, హైదరాబాద్‌లో సంఘమిత్ర సాంస్కృతిక సంస్థ నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి డా॥ఎస్. వేణుగోపాలాచారిని సత్కరిస్తున్న గుదిబండి వెంకటరెడ్డి. చిత్రంలో పి. వెంకటేష్ ముత్యాలనాయుడు, డా॥ చిల్లా రాజశేఖరరెడ్డి తదితరులు.

## వృద్ధాప్యం కవితాసంకలనానికి కవితలు ఆహ్వానం

'వృద్ధాప్యం' శీర్షికతో ప్రచు రించబోయే కవితాసంకలనానికి ఉభయ రాష్ట్రాల కవులు, కవయిత్రులనుండి కవితలు ఆహ్వానిస్తున్నాము.

ర్తిపేరు, అడ్రసు, ఫోన్‌నెంబరు తప్పని సరిగా పంపాలి, 3) కవితల ఎంపికలో సంపాదకునిదే తుదినిర్ణయం,4) కవిత 20లైన్లకు మించరాదు, 5) ఒక్కొక్కరు ఒక్క కవిత మాత్రమే పంపాలి, 6) కవితలను గుదిబండి వెంకటరెడ్డి, జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, బి70/ఎఫ్ 1, పి.ఎస్.నగర్, విజయనగర్ కాలని, హైదరాబాద్-500057. తెలంగాణ రాష్ట్రం చిరునామాకు 30.11.2019లోపు పంపవలెను. తరువాత వచ్చిన కవితలు పరిశీలించబడవు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.